వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 07 జూలై 2023


## బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్రస్నానం



**నందలూరు, జులై 6 ప్రభాతవార్త**

నందలూరులోని శ్రీ సౌందర్యవల్లి సమేత సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అట్టహాసంగా సౌమ్యనాథ స్వామి వారికి చక్ర స్నానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నామాలు ఉచ్చరిస్తూ సాగిన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. వేద పండితులు స్వామి వారికి సుగుంధ ద్రవ్యాలతో, చందాలతో అభిషేకం చేసి అనంతరం కోనేరులో చక్రస్నానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ అధికారులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధిహామి పనిలో గుండెపోటుతో వ్యక్తి మృతి

**చిట్వేలి, జులై 6 ప్రభాతవార్త**



నరసింహులు మృతదేహం

ఉపాధిహామి పనుల్లో భాగంగా గురువారం పనులకు వెళ్లి పనిని నిర్వహిస్తున్న వ్యక్తి గుండెపోటు రావడంతో ఆకస్మిక మృతిచెందిన సంఘటన చిట్వేలి మండలంలోని తిమ్మాయగారిపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. యధావిధిగా ఉపాది పనులకు వెళ్లిన అరుంధతివాడ నివాసి సంగటి చెంచయ్య కుమారుడు నరసింహులు(42) జాబ్‌కార్డు 20083 గల వ్యక్తి పనులను నిర్వహిస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారని వెంటనే చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా గుండెపోటు కారణంగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎపిఒ చంద్రకళ, ఇసి ఓబులేశులు తెలిపారు. తదుపరి సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రభుత్వం నుంచి అందాల్సిన 50 వేల మొత్తానికి సిఫారసు పంపామని అన్నారు. ఉపాదిహామి సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది సులోచనమ్మ, మోచర్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప జిల్లా పర్యటన ఖరారు

### పలు ప్రారంభోత్సవాలు చేయనున్న సిఎం - పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు : కలెక్టర్, ఎస్పీ

**కడప, వేంపల్లి, జూలై 28 ప్రభాతవార్త :**

జూలై 8 తేదీ నుండి 3 రోజుల పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్ రెడ్డి కడప జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి జూలై 8న మధ్యాహ్నం 1.30 గంటలకు కళ్యాణ దుర్గం చేరుకొని అక్కడ నుంచి హెలికాప్టర్ ద్వారా ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఇడుపులయాలోని రాజశేఖర్ రెడ్డి ఘాట్‌కు చేరుకొని ఆయనకు నివాళులు అర్పిస్తారు. అనంతరం సింహాద్రిపురం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం రాత్రికి ఇడుపుపాయలో బస చేస్తారు. అనంతరం 9వ తేదీ గండికోటలో పలుకార్యక్రమాలకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం పులివెందులలోని మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని అక్కడి కౌన్సిలర్లుతో ముచ్చటిస్తారు. మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పలు కార్యక్రమాలను ప్రారంభించారు. 10వ తేదిన కడపలో జరిగే పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించి, పలు పథకాలకు శంఖుస్థాపన చేయనున్నారు. అనంతరం కడప విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుంచి గన్నవరం ఏయిర్‌పోర్టుకు చేరుకుంటారు.





కడపలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎసీ్ప, ఇడుపులపాయలో ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

**సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**

కడప క్రైం, జులై 6, ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కడప నగర పర్యటన నేపథ్యంలో గురువారం ఆర్ట్స్ కళాశాలలోని హెలిప్యాడ్, రాజీవ్‌మార్గ్, రాజీవ్ పార్క్, ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, ఎశ్ప కేకేఎన్ అన్బురాజన్లు పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. భద్రతను కట్టుదిట్టం చేయాలని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, ఎస్పీలు ఆదేశించారు. వీరి వెంట ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజా ప్రభాకర్, పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఇడుపులపాయలో పర్యటించిన కలెక్టరు, ఎస్పీ**

వేంపల్లె, జూలై 6, ప్రభాతవార్త : జిల్లాలో ఈనెల 8, 9, 0 తేదీల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో భాగంగా గురువారం ఇడుపులపాయలో జిల్లా కలెక్టరు విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్‌లు పర్యటించారు. వైఎస్ఆర్ ఘాట్, హెలిప్యాడ్, సీఎం అతిథి గృహం, ప్రార్థనా మందిరం, ఆర్.కె.వ్యాలీలో నూతనంగా నిర్మించిన పోలీసుస్టేషన్ వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఇడుపులపాయ ప్రాంగణంలో బాంబు స్క్వాడ్‌లు క్షుణ్ణంగా పరిశీలించారు.

### చిన్న నాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి

# హత్య కేసులో కుట్రదారుడు అరెస్ట్

### - కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ వెల్లడి

**కడప క్రైం, జులై 6, ప్రభాతవార్త:**

గత నెల 23వ తేదీ ఉదయం నగరంలోని సంధ్యా కూడలిలో చిన్న నాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో ప్రధాన కుట్రదారుడైన పాలంపల్లి సుబ్బారెడ్డి అలియాస్ రాజు సుబ్బారెడ్డిని అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఇర్కాన్ సర్కిల్ వద్ద అరెస్టు చేశామని ఆయన గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత నెల హతల్యకు గురైన శ్రీనివాసులరెడ్డి ప్రస్తుతం అరెస్టైన సుబ్బారెడ్డిలు ఇద్దరూ 2020 వరకు సన్నిహితంగా కలిసి వ్యాపారాలు చేసుకునేవారన్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయి ఎవరి వ్యాపారం వారు చేసుకునేవారు. హత్య చేసేందుకు నిందితులకు సుబ్బారెడ్డి గట్టి ప్రోత్సాహం ఇచ్చారు. రూ.30లక్షలు డబ్బులు ఇవ్వడంతో పాటు కోర్టు వ్యవహారాలు చూసుకుంటానని భరోసా ఇచ్చాడు. హత్య కేసులో ఏ-3 ముద్దాయి అయిన మేరువ శ్రీనివాసులు అలియాస్ ల్యాబ్ శ్రీను హత్యకు కొన్ని రోజుల ముందు సుబ్బారెడ్డి ఇంటిలో కూర్చొని హత్యకు కుట్ర పన్నినట్లు ఆయన తెలిపారు. హతుడు శ్రీనివాసులురెడ్డి పాలెంపల్లి సుబ్బారెడ్డి ఇరువురి మధ్య కొన్ని భూ వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయి. అదే విధంగా వ్యాపారంలో విడిపోయిన తరువాత హతుడు శ్రీనివాసులురెడ్డి రోజు రోజుకు వ్యాపారంలో



ఎదుగుతూ వచ్చాడు. హత్య జరిగిన తరువాత ఏ-3 ల్యాబ్ శ్రీను పాలంపల్లి సుబ్బారెడ్డికి హత్య చేశాము. అతను చనిపోయాడంటూ ఫోన్ ద్వారా సామాచారం ఇచ్చాడు. దర్యాప్తులో భాగంగా హతుడికి ప్రస్తుతం అరెస్టు చేసిన ముద్దాయికి మధ్య భూ వివాదాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. గూగుల్ టేకౌట్ ద్వారా సాంకేతిక ఆధారాలను జతపరచడం జరిగిందని ముద్దాయి వాట్సాప్ మెసేజ్‌లను డిలీట్ చేశాడని వాటిని రిపీట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతం అరెస్టు చేసిన పాలెంపల్లె సుబ్బారెడ్డిపై 12 కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. ఇందులో రెండు హత్యాయత్నం కేసులు, రెండు ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులతో పాటు 5క ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా ఉన్నాయని డీఎస్పీ తెలిపారు.

# చినుకు పడితే చిత్తడే చిత్తడి...

### రోడ్లు వేయడంలో అధికారుల నిర్లక్ష్యం - పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

### రూ.130 కోట్లు నిధులు ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం - ప్రజా ప్రతినిధుల తీరుపై మండి పడుతున్న ప్రజలు

**బద్వేలు, జూలై 06 ప్రభాతవార్త :**

మున్సిపాలిటీలోని 35 వార్డులలో కొన్ని వార్డులలో మాత్రమే సీసీ రోడ్లు వేశారు తప్ప, మిగిలిన వార్డులలో రోడ్లు వేయకపోవడంతో ప్రజలు అధికారుల మరియు ప్రజా ప్రతినిధుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో రోడ్లు ఎలా ఉన్నా భరించే ప్రజలు వానా కాలం మొదలైన నేపథ్యంలో చినుకు పడితేనే చిత్తడి చిత్తడిగా మారి రోడ్లన్నీ దయనీయంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడిప్పుడే వర్షాలు మొదలవుతున్న నేపథ్యంలో కొద్దిపాటి వర్షానికి రోడ్లు జలమయం కావడం, బురదమయంగా ఉన్న రోడ్లపై వాహనదారులు, ప్రజలు నడవాలంటేనే కష్టతరంగా మారింది. ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు తప్ప మున్సిపాలిటీలోని వార్డులపై దృష్టిపెట్టి రోడ్లు వేసిన దాఖలాలు లేవు. రూ.130 కోట్లు నిధులను ముఖ్యమంత్రి బద్వేలు ప్రజలకు వరంగా ఇచ్చినప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించడమేగాక వాటిపై దృష్టి పెట్టడం లేదు. గడప గడప కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నా పట్టణంలో కొన్ని వార్డులలోకి వెళ్ళాలంటేనే భయపడుతున్నారు. ముఖ్యంగా కోట వీధిలోని ప్రధాన రహదారి, మిద్దెలవారిపాలెం, అగ్రహారం, మహబూబ్ నగర్, శివా నగర్, ఆంజనేయ నగర్, ఫాతిమా నగర్‌తో పాటు కొన్ని ప్రధాన వార్డులలో కూడా రోడ్లు లేకపోవడం దయనీయమైన పరిస్థితి. రూ.130 కోట్లలో రూ.35 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి మిగిలిన రూ.95 కోట్ల నిధులపై సందిగ్ధత ఏర్పడడంతో ప్రజలలో అసహనం ఏర్పడుతోంది. రోడ్లు వస్తాయా? రావా? అనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే త్వరలో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఆ నిధులను ఉపయోగిస్తారా? లేక వారి నిర్లక్ష్యంతో వెనక్కి పోతాయా అనేది కూడా అర్థంకాని పరిస్థితి. ఇప్పటికే కొన్ని వార్డులలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గడప గడప కార్యక్రమానికి వెళ్ళకపోవడానికి కారణం కూడా ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని తెలుస్తుంది. ఇప్పటికే ప్రజలు మండిపడడమే కాకుండా ఆ ప్రాంత ప్రజా ప్రతినిధుల తీరుపై కూడా మండి పడుతున్నారు. వర్షా



దయనీయంగా మారిన కోట వీధి రహదారి.

కాలం మొదలై వర్షాలు భారీగా వచ్చాయంటే రోడ్లన్నీ జలమయం కావడమే కాకుండా కొన్ని వార్డులలో నడవాలంటేనే కష్టతరంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోకపోవడమే ప్రధాన కారణం అని మండి పడుతున్నారు. కోట వీధి, మిద్దెలవారిపాళెం మధ్యలో ఉండే రహదారి మరీ దయనీయంగా మారింది. ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం, మున్సిపాలిటీ అధికారుల అలసత్వంతో రోడ్లు వేయకపోవడంతో ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనంలో వెళ్ళేవారు అనేక మంది జారి పడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇక నడుచుకుంటూ వెళ్ళాలంటే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని అంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లు లేని చోట త్వరగా రోడ్లు వేయాలని కోరుతున్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం

### ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

**రాయచోటి, జులై 06 ప్రభాతవార్త :**

రాయచోటి నియోజకవర్గం లో ఉద్యమంలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటిలోని ఆర్‌డిఓ కార్యాలయంలో జగనన్న సురక్ష నియోజక వర్గ ప్రత్యేక అధికారి, ఆర్‌డిఓ రంగస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జగనన్న సురక్ష కార్యక్రమ సమీక్షా సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మండలాల వారీగా ఏయే గ్రామాలలో జగనన్న సురక్ష క్యాంపులు పూర్తయ్యాయి, అక్కడ వచ్చిన సమస్యలు ఏమిటి, ఎన్ని పరిష్కరించారు, సాధారణ ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం వరంలా మారిందన్నారు. జగనన్న సురక్షలో వంద శాతం సమస్యలను పరిష్కరించి నియోజక వర్గాన్ని ఆదర్శంగా నిలిపేలా ప్రతి అధికారి, సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. సాంకేతిక సమస్యల పరిష్కార వివరణల కోసం శ్రీకాంత్ రెడ్డి సిఎంఓ అధికారులుతో మాట్లాడి మండలాల అధికారుల అనుమానాలును నివృత్తి చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తయితే ఎక్కడా సమస్యలు కనపడకూడదు, విన పడకూడదన్నారు. వాలంటీర్ల సర్వేలలో కూడా అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. మ్యాపింగ్ ఎలా జరుగుతోందంటూ ఆయన ఆరా తీశారు.



క్యాంపులలో మ్యుటేషన్ల పై ప్రజల నుంచి దరఖాస్తులు వస్తున్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వందశాతం పూర్తి చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామాలలో త్రాగు నీటి సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటి పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్సిడీ వేరుశనగ, కంది విత్తనాల పంపిణీ జారుగుతోందా? ఇంకనూ రైతులకు విత్తనాలు అవసరమైన వారికి అందేలా కృషి చేద్దామన్నారు. ప్రజలతో అధికారులు, సిబ్బంది మాట్లాడి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు.






## టీడీపీ నుండి వైకాపాలోకి పలువురు చేరిక

**పులివెందుల, జూలై 6, ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలకు ఆకర్షితులై టీడీపీ నుండి వైకాపాకు దాదాపు 100 కుటుంబాలు బలిజ సంఘ: నాయకుడు కడియాల లక్ష్మినారాయణ, తుమ్మలపల్లె విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల ద్వారకానగర్ కాలనీకి చెందిన మారుతి మోహన్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డిలతో పాటు 100 కుటుంబాలు గురువారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిల సమక్షంలో వైకాపాలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంపీ అవినాష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మారుతి మోహన్‌రెడ్డి, అర్జున్‌రెడ్డిలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలోకి వచ్చామన్నారు. మాపై నమ్మకంతో కడియాల లక్ష్మినారాయణ, విశ్వనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు పార్టీలో చేర్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా



వైకాపాలో చేరిన కార్యకర్తలతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా లోబడి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మార్కెట్ కమిటి ఛైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరె క్టరు గంగాధర్‌రెడ్డి, కోడిరమణ, పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, అంకా లమ్మ గుడి ఛైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 20 లోగా అన్ని సంపద కేంద్రాలు అందుబాటులోకి తీసుకురావాలి

### జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మీ ఆదేశం

**రాజంపేట అర్బన్, జులై 6 ప్రభాతవార్త**

ఈనెల 20 లోగా అన్ని పంచాయతిల్లో చెత్త నిర్వహణ పక్కాగా చేయాలని అన్ని ఎస్‌డబ్ల్యుసిసిలు నిర్వహణలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతి అధికారిని ధనలక్ష్మీ ఆదేశించారు. గురువారం మండలంలోని కూచివారిపల్లె ఎస్‌డబ్ల్యుసిసిని ఆమె పరిశీలించారు. కేంద్రం నిర్వహణ బాగుందని కూచివారిపల్లె పంచాయతి కార్యదర్శి నరసింహులును ఆదేశించారు. ఈ సందర్భంగా చెత్త నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతి కార్యదర్శుల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలన్నారు. పొడిచెత్త, తడిచెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యుసిసిల్లో ఎరువును తయారు చేయాలని ఆదేశించారు. కూచివారిపల్లె ఎస్‌డబ్ల్యుసిసిని మిగతా పంచాయతిలు ఆదర్శంగా తీసుకుని నిర్వహించాలన్నారు. పంచాయతిల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. పగటిపూట ఎక్కడ వీధిలైట్లు వెలిగినా సహించనని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన పనులను కూడా చేసుకోవచ్చునని సూచించారు. స్పందన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశిం చారు. పారిశుధ్యం మెరుగుపరచాలని ఆదేశించారు. చెత్త నిర్వహణ సక్రమం గా చేపడితే పారిశుధ్యం మెరుగుపడుతుందని హితవు పలికారు. అంకితభావంతో పంచాయతి కార్యదర్శులు పనిచేయాలని కోరారు. కూచివారిపల్లెలో మొక్కలు నాటారు. స్థానిక అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ పార్వతి, ఇఒఆర్‌డి హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎరువును పరిశీలిస్తున్న డిపిఒ ధనలక్ష్మీ






## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

### నివాళులు అర్పించిన ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష

**కడప, జులై 6 ప్రభాతవార్త :**

జనం కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి దళిత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం, ఆదర్శప్రాయం మని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.బి అంజాద్ బాష కొనియా డారు. గురువారం బాబు జగ్జీవన్ రామ్ 37వ వర్ధంతి సందర్భంగా స్థానిక నగరంలోని మహావీర్ సర్కిల్ వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి ఎస్. బి అంజాద్ బాష, నగర మేయర్ కె. సురేష్ బాబు లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ సామాన్య కుటుంబంలో జన్మించి, స్వాతంత్ర పోరాటంలో పాల్గొని స్వాతంత్ర్య సాధనలో విశేష సేవలందించి భారత దేశ ఉపప్రధానిగా, భారత ప్రభుత్వం లో కార్మిక శాఖామంత్రి గా,వ్యవసాయ శాఖ మంత్రిగా, పార్లమెంటులో సుదీర్ఘంగా పనిచేసిన పార్లమెంట్ సభ్యుని గా చరిత్రలో నిలిచిన మహనీయుడన్నారు. దేశంలో ఎన్నో ఉన్నత పదవులను అలంకరించి బడుగు,బలహీన వర్గాలు అభ్యున్నతికి కృషి చేసిన మహానేత బాబు జగజ్జీవన్ రామ్ అని అన్నారు.ఎన్నో ఉద్యమాలు చేసి కార్మిక చట్టాల్లో, వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి బడుగు, బలహీన వర్గాలు ప్రజలకు ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. దేశ.ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే నాయకుల్లో బాబు జగజీవన్ రామ్ మొదటి వరసలో ఉంటారని



తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి బాబు జగ్జీవన్ రావ్ ఆశయాలకు అనుగుణంగా బడుగు బలహీన వర్గాల కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా మంత్రి వర్గ కూర్పులో 70% స్థానాలు బీసీ,ఎస్సి ,ఎస్టి, మైనార్టీలకు కేటాయించి సామాజిక న్యాయం చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నామినేటెడ్ పదవుల్లో చట్టాన్ని తీసుకొనివచ్చి 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు.బాబు జగ్జీవన్‌రావ్ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ అందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ పులి సునీల్, ఎస్సి, ఎస్టీ సెల్ అధ్యక్షులు వినోద్, సీనియర్ నాయకులు అఫ్జల్ ఖాన్, స్థానిక కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, తోట కృష్ణ, ఇతర ఎస్సి, ఎస్టీ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మన రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ

### - నియోజకవర్గ అభివృద్ధికి రమేష్‌కుమార్‌రెడ్డిగా నేను గ్యారెంటీ

### - మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

**సంబేపల్లె, జులై 6, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును చేయాలని రాయచోటి ఎమ్మెల్యేగా రమేష్‌రెడ్డిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. గురువారం సంబేపల్లె మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీలోని అడవికంపల్లి పాలెంగడ్డ హరిజనవాడ, శ్రీనగర్ కాలనీలలో రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ రాష్ట్రానికి ఇదేం కర్మ, రచ్చబండ కార్యక్రమాలను మండల తెదేపా నాయకులు ప్రజలతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ వైసీపీ అరాచక పాలనపై ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగారు. ప్రతి ఇంటింటా రమేష్‌కుమార్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాయచోటి తెదేపా ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 5కోట్ల ఆంధ్రుల రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ, రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి నేను గ్యారెంటీ అని ఆయన ప్రజలకు తెలిపారు. ఈ వైసీపీ చేతకాని అసమర్థ పాలనలో ప్రతినిత్యం నిత్యావసర వస్తువుల దరలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. తెలుగు దేశం అధికారంలోకి వస్తే అన్నదాత పథకం కింద ఏపీలోనే ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం, తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువు తుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు చొప్పున అందజేయడం జరుగుతుందన్నారు. మహా శక్తి పథకం కింద నెలకు 1500 ఇస్తామన్నారు. ఏపీలో నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు



ప్రతి నిరుద్యోగికి యువగళం నిధి కింద నెలకు రూ.3వేలు ఇస్తామన్నారు. బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు. ఇందులో భాగంగా పలువురు ప్రజలు తమ గ్రామంలోని సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. అందుకు స్పందించిన ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రకాల సమస్యలు పరిష్కరించడమే కాకుండా గ్రామం అభివృద్ధి పథంలో నడిపిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లు నర్సారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు చిన్న రెడ్డయ్య యాదవ్, తెలుగు యువత అధ్యక్షులు హరి యాదవ్, గుట్టపల్లి వేణుగోపాల్ నాయుడు, బాలాజీ, శ్రీనివాసులు, తులసి, దినేష్ నాయుడు, వెంకటరమణ నాయుడు, గోవర్ధన్ నాయుడు, రాజేందర్ నాయుడు, రమేష్, నరేందర్ నాయుడు, వెంకటరమణ నాయుడు, గోపాల్ నాయుడు, సాయి కిరణ్, తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలు మృతి

**ఓబులవారిపల్లె, జులై 6, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు పంచాయతీలోని దిగు పల్లి గ్రామంలో నివాసముంటున్న షేక్ జాన్ ప్యారీ(70) అనే వృద్ధు రాలు ఇంటి వరండాలో బుధవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలపై కడ్డీతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలి పారు. వృద్ధురాలికి ఒక పెంపుడు కొడుకు ఉన్నారని ఎవరో ఆస్తి కోసమే చంపి ఉంటారని పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. డాగ్ స్క్వాడ్ ద్వారా సత్యమ్మ గుడి మసీదు దిగువపల్లి గ్రామంలో కలియతిరిగిందని వాటి ద్వారా కూడా కొంత సమాచారాన్ని సేకరించామని ఓబులవారిపల్లె ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని రాజంపేట డీఎస్పీ చైతన్య, కోడూరు సీఐ నరసింహులు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీశారు. శవ పరీక్ష కోసం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి విచా రిస్తున్నామని పూర్తి వివరాలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లి రైల్వే కోడూరు పోలీసులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు

**వైవీయూ, జులై 6, ప్రభాతవార్త:**



స్వాతంత్ర్య సమర యోధుడు, జనం కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. అంజ నేయ ప్రసాద్ అన్నారు.కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ లో బాబు జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. అంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ సుదీర్ఘకాలం పార్లమెంటేరి యన్‌గా, ఉప ప్రధాని గా ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం అని అన్నారు. రిజి స్ట్రార్ ఆచార్య ఈ.సీ సురేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ చేత అమూల్య భారత రత్నగా పిలువబడే బాబు జగ్జీవన్ రామ్ సామాజిక వివక్ష, అసమానతలు లేని ఒక స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య, సమాజ నిర్మాణం కోసం తన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానమంత్రిగా పనిచేసి మచ్చలేని నాయకుడిగా ఆదర్శ జీవితం గడిపారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూ టీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రవీణ్ వ్యాఖ్యలపై విచారణ వాస్తవాలు ప్రజలకు చెప్పాలి

### పోలీసులకు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే రాచమల్లు

**ప్రొద్దుటూరు జులై 6 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ఇటీవల కడపలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ప్రొద్దుటూరులో మూడు హత్యలు జరుగబోతున్నాయన్న ప్రవీణ్ వ్యాఖ్యలపై పోలీసులు విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు తెలపాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్పర్సన్ చాంబర్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రవీణ్ చేసిన హత్య ఆరోపణల వల్ల ప్రొద్దుటూరు ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజలలో ఈ భయాందోళనలను తొలగించేందుకు పోలీసులు ప్రవీణ్ ను విచారణ జరిపి వాస్తవ అవాస్తవాలను ప్రజలకు వివరించా ల్సిన అవసరం ఉందన్నారు. పట్టణం లో నిజంగా హత్యలు జరుగుతాయా లేక ప్రవీణ్ చేసిన ఆరోపణలు అసత్య లేన తేల్చి చెప్పాలని పేర్కొన్నారు. ప్రవీణ్ చెప్పినవి నిజాలని నిరూపణ అయితే తనపై చర్యలు తీసుకోవాలని లేదా అవాస్తవాలైతే ప్రవీణ్ పై చట్టపంూపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ రెడ్డి తనపై హత్య ఆరోపణలు చేసి పది రోజులు కావస్తున్న పోలీసులు పట్టించుకోక పోవడం విచారకరమన్నారు ప్రవీణ్ ఆరోపణలు నిజమే అయితే ముగ్గురు ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసిం హారెడ్డి రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు కాకర్ల నాగచైత రెడ్డి కౌన్సిలర్లు ఓబులరెడ్డి భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జడ్‌పీ హైస్కూల్లో ఆకస్మిక తనిఖీ చేసిన జడ్‌పిటిసి

**రామసముద్రం జులై 6, ప్రభాతవార్త**



రామసముద్రం మండల కేంద్రంలో జడ్పీ హైస్కూల్ నందు గురువారం జడ్పిటిసి సిహెచ్ రామచంద్రారెడ్డి ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు కార్యక్రమాన్ని శానిటేషన్ను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని మెనూ ప్రకారం పిల్లలకు వండి పెట్టాలి అన్నారు. అన్నమును బాగా ఉడికించి కూరలో గాను రుచికరంగా పెట్టాలి అన్నారు. కార్యక్రమంలో నాయకులు హెచ్ఎం చిట్టిబాబు, ఉపాధ్యాయురాలు గాయత్రి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మైదుకూరులో ఇంటింటి ప్రచారంలో బిజెపి కన్వీనర్

**మైదుకూరు జులై 6, ప్రభాతవార్త**



మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల కాలములో చేసిన కార్యక్రమాల షెడ్యూల్ గురించి ప్రజలకు వివరించిన మైదుకూరు నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మాచునూరు సుబ్బారాయుడు, గురువారం మైదుకూరు మునిసిపాలిటీ లోని 89వ పోలింగ్ బూత్ ప్రొద్దుటూరు రోడ్ వినాయక నగర్‌లో బుత్ స్థాయిలో ఇంటింట ప్రచార కార్యక్రమం నిర్వహిం చారు.'కేంద్ర ప్రభుత్వంలోని నరేంద్రమోడీ నాయకత్వంలో మనదేశం ఎంతో సస్యశ్యామలంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకంలో 75 శాతం కేంద్ర ప్రభుత్వ వాటా ఉంటుందని వార్డు ప్రజలకు వివరించి చెప్పారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం కన్వీనర్ మాచునూరు సుబ్బ రాయుడు, మైదుకూరు మండల అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ ఏవి సుబ్బన్న, కిషోర్, ఓబులేసు బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షలో 12 మంది డీబార్

**వైవీయూ జులై 6, ప్రభాతవార్త**

యోగివేమన విశ్వవిద్యా లయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డిబార య్యారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురిని స్వయంగా డిబార్ చేశారు. స్క్వాడ్ సభ్యులు ఆచార్య విజయ రాఘవ ప్రసాద్,ఎన్సీ గంగిరెడ్డి, ఆచార్య ఎంవి శంకర్, ఆచార్య చంద్ర ఓబులరెడ్డి వీరబల్లి రాయచోటి సుండుపల్లె కేంద్రా లలో తనిఖీ చేసి ఏడు మంది విద్యార్థులు డిపార్ చేశారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కేంద్రాలలో స్క్వాడ్ సభ్యులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కాపీలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

## డిజిటల్ ఎడ్యుకేషన్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

**పీలేరు, జూలై 06 ప్రభాతవార్తః**



స్థానిక పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాల ఆవరణంలో పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, కేవి.పల్లె, రాయచోటి నియోజకవరగ ంలోని సంబేపల్లె మండలాలకు సంబంధించిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్ పై శిక్షణ కార్యక్రమం ఆరు బ్యాచులకు (ఒక బ్యాచుకు రెండు రోజులు చొప్పున) ఈనెల 4వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరుగుతుంది. అందులో భాగంగా గురువారం రెండవ బ్యాచ్‌కు పీలేరు, కలికిరి, సంబేపల్లె , మండలాల నుంచి 244 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. ఈకార్యక్రమాన్ని కలికిరి ఎంఈఓ-1, కరీముల్లా, ఎంఈఓ-2 నాగార్జున ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్తులను గ్లోబల్ సిటిజన్సుగా ప్రపంచంతో పోటీపడే విధంగా తయారుచేయాలని దఢ సంకల్పంతో డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రారంభించారన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం ఉపాధ్యాయులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమంలో ఐఎఫ్‌ను ఎలా వినియోగించుకోవాలి బైజూస్ కంటెంట్ ఎలా ఉపయోగించాలి, ఈలర్నింగ్‌పై శిక్షణ ఇవ్వబడుతుందని అన్నారు. ప్రభుత్వం విద్యార్తుల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన సాంకేతిక పద్ధతులు ద్వారా విద్యను అందిస్తుందని కాబట్టి ఉపాధ్యాయులు కూడా అందుకు తగ్గట్లుగా పిల్లలకు బోధించాలని ఉపాధ్యాయులు ఎల్లప్పుడు అప్డేట్‌గా ఉండాలన్నారు. శిక్షణ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. శిక్షణ కార్యక్రమం ట్రైనర్సుగా కలికిరి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నూర్‌మహమ్మద్, కేశవకుమార్, దుర్గారావు, రాజు పాల్గొన్నారు. కలికిరి, పీలేరు సంబేపల్లె మండలాల నుంచి 244 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండో రోజు వైఎస్ఆర్ కాలేజీ కాంట్రాక్టు అధ్యాపకుల పరీక్ష

**ప్రొద్దుటూరు అర్బన్ జులై 6, ప్రభాతవార్త**



జీఓ నెంబర్ 110 అమలు కోసం వైయస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కాంట్రా క్టు అధ్యాపకులు నిర్వహిస్తున్న నిరసన దీక్ష గురువారం రెండవ రోజు కు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 ఏళ్లుగా తాము కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పని చేస్తున్నామని, కానీ ప్రస్తుతం యూనివర్శిటీ అధికారులు, వైఎస్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ తమ గత సర్వీస్ ను పరిగణనలోకి తీసుకోమని, తమ స్థానంలో కొత్త వారిని తీసుకుంటామని, ఫోన్ ద్వారా తమను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని వివరించారు. కానీ తాము ఏకత్రాటి పైకి వచ్చి దీక్ష కొన సాగిస్తున్నామని తెలిపారు. కాగా జనసేన నాయకులు మాదాసు మురళీ ఈ విషయమై స్పందిస్తూ గత కొనేళ్లుగా ఇంజనీరింగ్ విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు నేడు ఇంటర్వ్యూలు సాకు చూపి ఏ ఒక్క ఉద్యోగినైనా తొలిగిస్తె తీవ్ర పరిణామాలు ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు.

## ఏపీ మాలమహానాడు కడప జిల్లా ఉపాధ్యక్షుడిగా పందిటి శ్రీనివాసులు

**ప్రొద్దుటూరు అర్బన్ జులై 6, ప్రభాతవార్త**



వైస్సార్ కడప జిల్లా లో గురువారం ఏపీ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు జాకట్ విజయ శేఖర్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరం నివాసి పందిటి శ్రీనివాసులను కడప జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏక గ్రీవంగా నియ మించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జాకట్ విజయ శేఖర్ కి పందిటి శ్రీనివాసులు కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

## నియోజకవర్గ తెదేపా కుటుంబ సభ్యులకు మనవి

**పీలేరు, జూలై 06 ప్రభాతవార్తః**



నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు 15 నుంచి 17 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న యువకులు ఆధార్ కార్డులు, టీసీలు దొంగ ఓట్లు చేర్చుటకు కలెక్టు చేస్తున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు వారి వారి గ్రామాల్లో బూత్ లెవల్ అధికారుల దష్టికి తీసుకుపోయి ఒరిజినల్ ఆధార్‌కార్డులు, టీసీలు వెరిఫై చేసిన తరువాతనే ఓట్లు చేర్చండి, లేదంటే రిజెక్టు చేయమని అధికారులకు తెలి పారు. ఈ విషయంగా ప్రతి గ్రామంలోని తెదేపా కార్యకర్తలు నాయకులు కలకడ, కేవి.పల్లె, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు తహశీల్దార్ల దష్టికి తీసుకుపోయి వినతి పత్రం అందించాలని తెదేపా జాతీయ నేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కోరారు.

## జిల్లా రచయితల సంఘం మహాసభలను నిర్వహిస్తాం

**ప్రొద్దుటూరు అర్బన్ జులై 6, ప్రభాతవార్త**



కడపజిల్లా రచయితల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి జిల్లా రచయితల సంఘ మహాసభలను నిర్వహించే ఆలోచన ఉందని జిల్లా రచయితల సంఘమాజీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ అన్నారు. గురువారం రాయల పంతులపేటలోని ఆయన స్వగృహంలో కవయిత్రిమొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగ పెంట హనుమంతరావు, పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, లలిత కళానికేతన్ అధ్యక్షులు ఆచార్య మూల మల్లి కార్జున రెడ్డి ఆయనను కలిసి సన్మానించారు. సత్యాగ్ని మాట్లాడుతూ గతంలో డాక్టర్ మల్లెమాల వేణుగోపాల్ రెడ్డి, జానుమద్ది హను మాత్ శాస్త్రి కాలం లో మహాసభలు బాగా జరిగాయని నాలుగు దిశల కడప కీర్తి వ్యాపించిదని మనమందరం కలిసి ఆ సంఘ పూర్వవైభవంకు కృషి చేయా లని ఆయన కోరారు.

## జగన్ ప్రభుత్వం ఉంటే వైసిపికి ఓటు వేయండి : ఎమ్మెల్యే

**ప్రొద్దుటూరు, జులై 6, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు నియోజక వర్గంలో జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే తిరిగి వైసిపికి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ 2వ సచివాలయం పరిధిలో సర్పంచ్ గద్దె మోషే ఉప సర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడకేసిన సమస్యల పరిష్కారానికి జగ నన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు ఈ కార్యక్రమం ద్వారా సాంకేతిక కారణాలు గాని మరి ఏ ఇతర సమస్యల వల్ల సంక్షేమ పథకాలు లబ్ది పొందకపోతే సమస్యలను పరిష్కారం చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యం అన్నారు. కాకుండా ప్రభుత్వం ద్వారా పొందే 11 రకాల సేవలను ఉచి తంగా పొందవచ్చు అన్నారు. పథకాలతో మీకు మేలు జరిగి ఉంది అంటేనే తిరిగి వైసిపి కి ఓటు వేయాలని లేదంటే వేయవద్దని స్పష్టం చేశారు కార్యక్రమంలో మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్ యాదవ్ మండల ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి ఎండిఓ కులాయమ్మ సర్పంచ్ గద్య మోషే ఉపసర్పంచ్ బీరం రాఘవేంద్ర రెడ్డి ఎంపీటీసీలు ప్రజలు పాల్గొన్నారు.

## పీవీసీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా సావిత్రి

**వాల్మీకిపురం, జూలై 06 ప్రభాతవార్తః**



స్థానిక ప్రభుత్వ పీవీసీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా సావిత్రి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జోన్-4 పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా పదోన్నతిపై శ్రీసత్యసాయి జిల్లా కదిరి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడు తూ పాఠశాల అభివద్దితో పాటు పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ముందుకు వెళ్తామన్నారు. పాఠశాల బందం పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడితోటల్లో కోత అనంతరం తీసుకోవాల్సిన పద్ధతులపై శిక్షణ

**పీలేరు, జూలై 06 ప్రభాతవార్తః**



తలపుల గ్రామం పీలేరు మండలం లో మామిడి తోటల్లో కోత అనంతరం తీసుకోవాల్సిన పద్ధతులపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ మామిడి పంట కోసిన తరువాత చెట్లకు 20 రోజులు విశ్రాంతి ఇచ్చి మామిడి తోటల్లో అడ్డదిడ్డంగా పెరినటువంటి కొమ్మలు, తెగులు ఆశించిన కొమ్మలును కత్తిరించి సూర్యరశ్మి చెట్లుకు బాగా తగిలేలా చూడాలన్నారు. ఈకత్తిరింపులు చేసిన తరువాత మామిడి చెట్లపై బ్లైటాక్సు మందు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. ఈవిధంగా చేసి నట్లయితే చీడపీడలను తగ్గించి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయసలహా సభ్యులు బోదేషా వలి, ఉద్యానశాఖ అధికారి సుకుమార్ రెడ్డి , ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిని సంపూర్ణంగా నివారిద్దాం

**వాల్మీకిపురం, జూలై 06ప్రభాతవార్తః**



క్షయ వ్యాధి నివారణకు ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయని మండల వైద్యాధికారిని మౌనిక అన్నారు. మండలం లోని జగ్రావారిపల్లె ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో గురువారం స్వయం సహాయక సంఘాల సభ్యులందరికి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా క్షయ వ్యాధిఒ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో టీబీ యూనిట్ అధికారి నాగిరెడ్డి, సర్పంచి మునిభాస్కర్, వైద్య సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ప్రజలకు రక్షణ

**పీలేరు, జూలై 06 ప్రభాతవార్తః**



జగనన్న సురక్ష పథకం ప్రజకు సత్వర సేవలు అందించడంలో రక్షణ కవచంగా ఉంటుందని ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, సర్పంచి హబీబ్‌బాషా, రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయం మూడు కు సంబంధించి పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రం దవపత్రాలు పంపిణీలో 64 శాతం ఉండగా పీలేరు మండలం 81శాతం ఇతర మండలాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇందులో సత్వర సేవలు అందించడంలో సచివాలయ ఉద్యోగుల సేవ అభినందనీయమన్నారు. విద్యార్తుల కు కావాల్సిన కుల, ఆదాయ, నివాస దవీకరణ పత్రాలను సత్వరం ఉచితంగా అందించేందుకు సచివాలయ సిబ్బంది వలంటీర్లు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం కటువ కాలువ వీధిలో వీఓఎస్‌ల సమావేశం లో సర్పంచి హబీబ్‌బాసా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రుణాలు వాటి ఉపయోగాలను వీఓఎస్‌లకు వివరించారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని కోరారు.

## సమాచారం ఇవ్వలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

**వాల్మీకిపురం, జూలై 06 ప్రభాతవార్తః**

మండలంలోని చింతపర్తి మేజర్ పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబుపై సర్పంచి మహిత గురువారం లికితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మహిళా సర్పంచ్‌గా మమ్మల్ని కించపరుస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఈనెల 5వ తేదీన నిర్వహించారని ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించకుండా తమకు ఆహ్వానం ఇవ్వకుండానే కార్యక్రమం నిర్వహించాన్నారు. నిర్ణీత సమయానికి గ్రామసభ నిర్వహించకుండా అలసత్వం వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను చట్టాలను ఉల్లంఘిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

## నిరాశ్రయులకు బ్రెడ్లు పంపిణీ..

**కడప కార్పొరేషన్, జులై 6, ప్రభాతవార్త:**



బాబూ జగ్జీవన్‌రామ్ కేంద్ర మంత్రిగా, కార్మికశాఖ, రక్షణ శాఖామంత్రిగా అనేక సేవలందించిన గొప్ప సంఘ సంస్కర్త అని వైసీపీ మహిళా నాయకురాలు చైతల్య, దళిత నాయకులు మార్కెట్ యార్డు డైరెక్టర్ పల్లెకొండు సంపత్‌లు అన్నారు. బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం ప్రేమాలయం నిరాశ్రయులకు వసతి గృహంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి బ్రెడ్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు సాయిదత్త, నాయకులు శ్యాంసన్, మహిళా నాయకురాళ్లు తులసమ్మ, పద్మ, శివమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారు సజ్జలను కలిసిన వైద్య విద్యార్థులు

**కడప కార్పొరేషన్, జులై 6, ప్రభాతవార్త:**



ఏపీ నీట్ పీజీ, డిప్లొమో సంబంధించిన మన రాష్ట్ర వైద్య విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం గురించి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సజ్జల రామ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లామని ఏపీ పీజీ అస్పిరంట్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు డా.సాగర్ కుళాయిరెడ్డి తెలిపారు. బి కేటగిరిలో దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఓపెన్ కౌన్సెలింగ్ లేదన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ఉందని చెప్పారు. కొన్ని రాష్ట్రాలలో ఫీజు తక్కువ ఉండడం వలన ఇతర రాష్ట్రాల వారు రాష్ట్రంలో సీటు పొందుతున్నారని వివరించారు. దీని వలన మన రాష్ట్ర వైద్య విద్యార్థులకు నష్టం జరుగుతుందని బాధను వ్యక్తం చేశారు. నీట్ నియమాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కూడా మన రాష్ట్ర వైద్య విద్యార్థులకు న్యాయం జరిగేలా చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు సువర్ణ అవకాశం జగనన్న సురక్ష

### ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు రూరల్, జులై 6 ప్రభాతవార్త**



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష అనే ఒక అద్భుత ప్రక్రియ అని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక సచివాలయం-2 పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ఉపసర్పంచ్ తోట శివసాయి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పథకాలు అందనివారు ఎవరూ ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని అన్నారు. అన్నమయ్య వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశచరిత్రలో జగనన్న సురక్ష లాంటి సంక్షేమ పథకం మరెక్కడా లేదని బాధితులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. ఉప మండలాధ్యక్షుడు ధ్వజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. ఉపసర్పంచ్ తోట శివసాయి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష సువర్ణ అధ్యాయమని, బాధితులను ఆదుకోవడంలో ఇంతకుమించిన కార్యక్రమం అవసరం లేదని, ఆర్థిక లోటుతో ఉన్న రా ష్ట్రాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రివర్యులు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, సుధాకర్‌రాజు, నాగేంద్ర, సర్పంచ్‌లు శివయ్య, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, నాయిని హరిక్రిష్ణారెడ్డితో పాటు వాటర్‌ప్లాంట్ రాజా, గోపి, వైఎస్ కరిముల్లా, రవూఫ్, మహ్మద్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం అలవరుచుకోవాలి

### - ఎంవిఐ శేఖర్ రావు



మాట్లాడుతున్న ఎంవిఐ శేఖర్ రావు, ఎంవిఐ శేఖర్ రావును సత్కరిస్తున్న పాఠశాల హెచ్ఎం బసవ రాజు.

**బద్వేలు అర్బన్, జూలై 06 ప్రభాతవార్త :**

బద్వేలు ప్రాంతంలో గత 7 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు తిరుమల ట్రస్ట్, బెంగుళూరు వారు సహృదయంతో విద్యా సామాగ్రిని ఉచితంగా అందజేయడం సంతోషకరమని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రావు అన్నారు. గురువారం తిరుమల ట్రస్ట్, బెంగుళూరు వారి సహకారంతో సిద్ధవటం రోడ్‌లోని ఎరుకల వీధి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు పాఠశాల హెచ్‌యం బసవరాజు, ఉపాధ్యాయురాలు పాలా అరుణ కుమారి, ఎన్.జయమ్మ, ఒ.సంగీత సుధారాణిల ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని ఎంవిఐ శేఖర్ రావు, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, గౌరిసాయి బార్ యజమాని బ్రహ్మదేవుని యర్రంరెడ్డి, ఆర్యవైశ్య ప్రముఖులు పబ్బతి సత్యానారాయణ, సచివాలయం విద్యా కార్యదర్శి చిరంజీవిల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంవిఐ శేఖర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండే కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యతో పాటు సంస్కారం, సేవా భావం, దాతృత్వం కలిగి ఉండాలన్నారు. మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ అని భావించి మెలగాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. అనంతరం ఎంవిఐ శేఖర్‌రావుకు పాఠశాల హెచ్‌యం మరియు ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు బసవరాజు మాట్లాడుతూ ఎరుకల వీధి పాఠశాలలోని విద్యార్థులకు తిరుమల ట్రస్ట్ వారు ఇప్పటికి అనేక దఫాలుగా విద్యా సామాగ్రిని వితరణ చేయడం జరిగిందని, అన్ని దానాలలో కన్నా విద్యా దానం చాలా గొప్పదని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సహాయం చేసిన వారిని మరిచిపోకుండా మీరు కూడా మంచి స్థాయికి చేరుకున్నపుడు పలువురికి సహాయం చేసే గుణం కలిగి ఉండాలని వారు విద్యార్థులకు పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పబ్బతి సుదీప్తి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

**బద్వేలు అర్బన్, జూలై 06 ప్రభాతవార్త :**



రక్తదానం చేస్తున్న కంభం శివారెడ్డి

రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని బద్వేలు బ్లడ్ దోనార్స్ గ్రూప్ అడ్మిన్స్ పోకల నాగేశ్వర్ రెడ్డి, కనమర్లపూటి కళ్యాణ్, వల్లంకొండు రాఘవేంద్ర అన్నారు. గురువారం సాదక్ హాస్పిటల్‌లో ఓ మహిళకు '0' పాజిటివ్ రక్తం అత్యవసరమని అడిగిన వెంటనే స్పందించిన కంభం శివారెడ్డి అనే యువకుడు వెంటనే ఆ మహిళకు రక్తదానం చేశారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానంతో సమానమని శివారెడ్డిని సాదక్ హాస్పిటల్ డా॥ హుస్సేన్‌తో పాటు గ్రూప్ అడ్మిన్స్ మరియు పలువురు నాయకులు అభినందించారు.

## అధిష్టానం పిలుపుతో విజయవాడకు దేశం నేతలు

**పుల్లంపేట, జులై 6 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు నియోజకవర్గంలో దేశంలో నేతలు తెలుగుదేశంపార్టీ అధిష్టానం పిలుపుతో బుధవారం రాత్రి విజయవాడకు బయలుదేరారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ మండల అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులకు మాత్రమే ఈ పిలుపు వచ్చినట్లు పార్టీకి చెందిన ఓ మండల నాయకులు తెలియజేశారు. కోడూరుకు వెళ్లిన ఆ మండల అధ్యక్షుడు తిరుపతి నుంచి విజయవాడకు వెళుతున్నట్లు కూడా తెలియజేశారు. నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ స్థితిగతులపై మాట్లాడేందుకు ఈ నాయకులకు పిలుపు వచ్చినట్లు సమాచారం. గత 3, 4 సార్లు జరిగిన ఎన్నికల్లో రైల్వేకోడూరు నుంచి తెలుగుదేశంపార్టీ పరాజయం చెందుతుండడం, త్వరలో ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఈ పిలుపు రావడంపై పలురకాలుగా పలువురు అనుకుంటున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గ ఒకప్పుడు తెలుగుదేశంపార్టీకి కంచుకోటగా ఉండేది. ఆ తర్వాత వరుస పరాజయాలతో తెలుగుదేశంపార్టీలో సామాన్య కార్యకర్తల నుంచి ఒకరకమైన నాయకుడు వరకు కూడా నిరుత్సాహంతో ఉన్న విషయం అందరికి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో రాబోవు ఎన్నికల్లో ఏవిధంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలి అనే విషయాలపై కూడా మాట్లాడేందుకు ఈ పిలుపు రావడం ప్రత్యేకత సంతరించుకుందని కూడా పేర్కొంటున్నారు. శుక్రవారం జరిగే అధిష్టానం వర్గంతో సమావేశంలో ఏవిధంగా నియోజకవర్గంలో టిడిపిని ముందుకు తీసుకెళ్లాల అనే విషయాలపైనా లేక పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి ఉన్న నిరుత్సాహం నిస్పృహలను ఏవిధంగా తొలగించాలనే విషయాలపైనా లేక కార్యకర్తలతోను, గ్రామ, మండల స్థాయి నాయకులతోను ఏవిధంగా దగ్గరకు తీసుకోవాలి, వారితో ఏవిధంగా మెలగాలి, వారిని పార్టీకి ఏవిధంగా ఉపయోగించుకోవాలి అనే విషయాలపైనా లేదా పార్టీలోకి కొత్తవారిని తీసుకోవడంలో ఏవిధంగా వ్యవహరించాలనే విషయాలపైనా లేదా నాయకుల మధ్య ఉన్న కొంత విభేదాలను సర్దుబాటు చేసి పార్టీని బలోపేతం చేసే దిశగా సలహాలను ఇవ్వడానికా అనే విషయాలపై కూలంకశంగా శుక్రవారం సాయంత్రానికి గాని పూర్తి సమాచారం తెలిసే అవకాశాలు ఉన్నాయని తెలుగుదేశం వర్గాలు పేర్కొంటున్నాయి.

## సమాజంలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం

**రాజంపేట అర్బన్, జులై 6 ప్రభాతవార్త**



ఆర్యవైశ్య సంఘం నాయకుల భేటీలో టిడిపి సీనియర్ నేత జగన్‌రాజు

అనాధిగా ఆర్యవైశ్యులు సమాజంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని టిడిపి సీనియర్ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం ఆర్యవైశ్య సంఘం నేతల ఆహ్వానం మేరకు తేనీటి విందులో ఆయన పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పాల ప్రకాష్ నివాసంలో పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య సంఘం నేతలతో భేటీ అయ్యారు. పట్టణంలో ఆర్యవైశ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేసేందుకు ఎప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. వ్యాపార రంగంలో నేటికి కూడా వ్యాపార లావాదేవీలు గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్యవైశ్యులనే నమ్ముతున్నారంటే అతిశయోక్తి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు టి.మణికంత, వి.శ్రీనివాసులు, బి.హరి, పి.ధనుంజయ్య, కె.మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, కర్నాటం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా జునోసిస్ డే కార్యక్రమం

**చిట్వేలి, జులై 6 ప్రభాతవార్త**



'ప్రపంచ జునోసిస్ దే' సందర్భంగా గురువారం చిట్వేలి స్థానిక పశువుల ఆసుపత్రిలో విజయవంతంగా పశుసంవర్ధకశాఖ ఎడి కెడి వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటి డిఎంహెచ్ఒ చెన్నకృష్ణ, తెలంగాణ వెటర్నరి కౌన్సిల్ డాక్టర్ బిఎస్ రాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంపుడు జంతువుల ద్వారా మనుషులకు మసూచి యంత్రాక్స్ లాంటి పలు రకాల వ్యాధులు సంక్రమిస్తాయని సన్నిహితంగా ఉండేవారు చేతులు శుభ్రపరుచుకోవాలని అన్నారు. యజమానులు వైద్యుల సూచనలు, సలహాలను పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ చికిత్సలతో పాటు రాబిస్ వ్యాధి నిరోధక వ్యాక్సిన్లను వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు భువనేశ్వరి, వేదవతి, ఖుర్షిద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో దేవాలయాలకు రక్షణ కరువు

### జనసేన రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి

**మదనపల్లె, జులై 6 ప్రభాతవార్త :**



వైకాపా ప్రభుత్వ పాలనలో హిందూ దేవాలయాలకు రక్షణ కరువైందని జనసేన పార్టీ రాయలసీమక కోకన్వీనర్ రాందాస్‌చౌదరి తెలిపారు. తిరుమలలో పార్వేటి మండపం కూల్చివేతను నిరసిస్తూ గురువారం పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జనసేన పార్టీ నాయకులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు, హిందూ సంస్కృతికి, హిందూ ధర్మానికి రక్షణ కరువైందన్నారు. అనేక దేవాలయాల మీద దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం తిరుపతిలో పురాతనమైన పార్వతి మండపంలో ఓ స్థంభం దెబ్బతిందని ఆ మండపాన్ని అన్నమయ్య జీవించిన మండపంపై దాడి జరిగింది. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పురాతన ఆలయాలు, ధర్మాన్ని పరిరక్షించాల్సిన భాధ్యత అందరిమీద ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకలు జంగాల శివరామ్, జగదీష్, గ్రానైట్ బాబు, మోహన్‌కుమార్, గద్దం లక్ష్మీపతి, నవాజ్ తెలిపారు.

## స్కూల్ స్వీపర్లకు అలవెన్స్‌లు వర్తింప చేయాలి

### ఏఐటియుసి నాయకులు డిమాండ్

**మదనపల్లె, జులై 6 ప్రభాతవార్త :**



మున్సిపల్ స్కూల్ స్వీపర్లను పారిశుద్ధ్య కార్మికులుగా పరిగణించి రూ.12 వేలు వేతనం చెల్లించి, హెల్త్ అలవెన్స్, పిఎఫ్, ఈఎస్ఐ వంటివి వర్తింప చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేసి కమీషనర్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ పిఆర్‌సి సిఫారసులలో పార్ట్‌టైం పద్దతిలో పని చేసే కార్మికులకు కూడా కనీస వేతనం చెల్లించాలన్నారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు వర్తింప చేయకపోవడం భాదాకర మన్నారు. రోజంతా వెట్టిచాకిరి చేసేవారిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. అరకొర వేతనాలతో స్వీపర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే అల వెన్స్‌లను వర్తింపచేసి స్కూల్ స్వీపర్లను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, దేవా, మాధవి, స్వీపర్లు శివమ్మ, అమల, జయమ్మ, అలి వేలమ్మ, సుబ్బలక్ష్మి, రెడ్డమ్మ, మాబుజాన్ పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్లు తనిఖీ

**మదనపల్లెక్రైం, జులై 6 ప్రభాతవార్త :**



పట్టణంలోని ఆరోగ్య కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లను గురువారం జిల్లా అదనపు డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శైలజ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత రిజిష్టర్లు, సర్టిఫికెట్లు, స్కానింగ్ మిషన్‌లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పట్టణంలోని రామారావు కాలనీలో ఉన్న ఆరోగ్యకేంద్రంను తనిఖి చేశారు. ఆరోగ్య కేంద్రంకు వస్తున్న అవుట్‌పేషెంట్లు, క్షయలక్షణాలు కల వారిని గుర్తించి టెస్టింగ్‌లు సంఖ్య పెంచాలని తెలిపారు. 2025 లోపు టిబి రహిత దేశం కోసం కిందిస్థాయినుంచి క్షయ కేసులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అమరావతి, సాయితేజనాయక్, టిబి సూపర్‌వైజర్ ఎస్.ప్రభాకర్, డిపిఎంలు వేణుగోపాల్, శ్రీనివాసులు, టిబి విభాగం సుశీల, వనజకుమారి, తరుణ్, ల్యాబ్ టెక్నిసియన్స్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

**కురబలకోట, జులై 6 ప్రభాతవార్త :**



రోడ్డు ప్రమాదంలో ఓ రైతు దుర్మరణం పాలైన సంఘటన గురువారం కురబలకోట మండలంలోజరిగింది. గుర్రంకొండ మండలం శెట్టివారిపల్లె పంచాయితీ అరిగెలవారిపల్లెకు చెందిన గణేష్(43) ఇతనికి భార్య అలివేలమ్మ, ఇద్దరు కుమార్తెలు కలరు. ఇతను సొంత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. దారిలో కురబలకోట మండలం మట్లివారిపల్లె సమీపంలో ఎదు రుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టి వెళ్ళిపోయింది. ప్రమాదంలో గణేష్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకొన్న ముదివేడు పోలీసుల సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. గణేష్ భార్య పిల్లలు ఆసుపత్రికి చేరుకొని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీస్ టాస్క్‌ఫోర్స్ అప్రమత్తంగా ఉండాలి

### డిఎస్‌పి కేశప్ప

**మదనపల్లెక్రైం, జులై 6 ప్రభాతవార్త :**



పోలీస్ టాస్క్‌ఫోర్స్ టీమ్ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె డిఎస్‌పి కేశప్ప అన్నారు. సబ్‌డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి స్పెషల్ టాస్క్‌పోర్స్ నిమిత్తం ఇద్దరు కానిస్టేబుల్స్‌లను నియమించామని వారికి ప్రత్యేక శిక్షణ, డ్రస్‌కోడ్ కలిగి ఉంటారని తెలిపారు. ఎక్కాడైన అసాంఘీక కార్య కలాపాలు, ఘర్షణలుజరుగుతున్నట్లు సమాచారం తమకు వచ్చినా వెంటనే టాస్క్‌పోర్స్ ముందుంటారని తెలిపారు. సబ్‌డివిజనల్ పరిధిలో ఎవరైనా ప్రముఖ ప్రజా ప్రతినిధులు, విఐపిలు పర్యటించినపుడు వీరి బందోబస్తు నిర్వ హిస్తారని డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో సిఐ సత్యనారాయణ, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైజాగ్ రైతబజార్లకు మదనపల్లె టమోటాలు

### మార్కెటింగ్‌శాఖ జేడి రామాంజనేయులు

**మదనపల్లె, జులై 6 ప్రభాతవార్త :**



విజయవాడ, వైజాగ్, గుంటూరు రైతు బజారుల్లో రాయితీపై మదనపల్లె టమోటాలు విక్రయిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మార్కెటింగ్ డైరెక్టర్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. గురువారం మదనపల్లె టమోటా మార్కెట్ యార్డును సందర్శించారు. ఇక్కడ రైతుల నుంచి నాణ్యమైన 20టన్నుల టమోటా లను మార్కెటింగ్‌శాఖ ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. దూర ప్రాంతాలైన గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం రైతుబజార్లకు ఈ టమోటాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వద్ద నుంచి కిలో రూ.100లు కొనుగోలు చేసి అక్కడి ప్రజలకు రూ.50లకే విక్రయిస్తామని తెలిపారు. విజయవాడకు పదిటన్నులు, గుంటూరుకు 5టన్నులు, విశాకపట్టణంకు 5టన్నులు టమోటాలను మార్కెటింగ్ అధికారులు ఎగుమతి చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఏడిఎం త్యాగరాజు, సెక్రటరీ అభిలాష్, మార్కెట్‌యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మిట్స్‌కు తైవాన్ యూనివర్శిటి డీన్‌లు రాక

**కురబలకోట, జులై 6 ప్రభాతవార్త :**

ఆసియా విశ్వవిద్యాలయం తైవాన్‌కు చెందిన ఐదుగురు డీన్‌లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు శుక్రవారం రానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెల్పిపారు. కళాశాలలో సందర్శిస్తారని ఇందులో భాగంగా అకడమిక్ ఎక్సలెన్స్‌ను పెంచడానికి, ఇంటర్న్‌షిప్‌లు, ఎంఎస్‌ప్రోగ్రామ్‌లు, ఇతర వర్చువల్ సమగ్ర కార్యకలాపాలు, అనేక విద్యా కార్యకలాపాల గురించి చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఇంటర్‌నేషనల్ కళాశాల డీన్ డాక్టర్ యింగ్‌హూయ్ చంద్, కాలేజ్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సెన్స్ డీన్ డాక్టర్ జియూన్ జోంగ్‌ఫూ, కాలేజ్‌ఆఫ్ ఇన్‌పర్‌మేషన్ డాక్టర్ చింగ్ హుస్స్, కాలేజ్‌ఆఫ్ మేనేజ్‌మెంటు డీన్ డాక్టర్ చున్‌వీరెన్, ఇండస్ట్రీ అకాడమి సహకారం డీన్ డాక్టర్ చార్లస్ సిఎన్ విచ్చేస్తారని ఆయన తెలిపారు.

## ప్రజల వద్దకే పౌరసేవలు

### జడ్పిటిసి, ఎంపిపిలు

**కురబలకోట, జులై 6 ప్రభాతవార్త :**




ప్రజల ముంగిటకే 11రకాల పౌరసేవలను అందిస్తున్నట్లు జడ్పిటిసి బైసాని జ్యోతి చంద్ర శేఖర్‌రెడ్డి, ఎంపిపి దస్తగిరి సాబ్ తెలిపారు. గురువారం కురబలకోట, తెట్టు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్‌లు సుజాత, తెట్టు మనోహర్‌రెడ్డిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. కోట్లాదిరుపాయలు వెచ్చించి అభివృద్ధి పనులుచేపట్టామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికి మంజూరు చేశామని తెలిపారు. అర్హులుగా ఉండి పథకాలు లబ్ధిపొందని వారు ఉంటే గుర్తించి పేర్లు నమోదు చేయించాలని గ్రామ సచివాలయ, వాలంటీర్లను కోరారు. కురబలకోటలో 156వివిధ రకాల సర్టిఫికెట్లు, తెట్టులో 162 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రమణారెడ్డి, ఉపసర్పంచ్ రజని, ఎంపిటిసిలు ఎసానుల్లా, నరసమ్మ, ఆలయ ఛైర్మెన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్, తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, గ్రామ సెక్రటరీలు శేషగిరికుమార్, నవాజ్, నాయకులు, సచివా లయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## స్థలదాతకు సన్మానం

**కురబలకోట, జులై 6 ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన కురబలకోటలో మురికికాలువల నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చిన సి.ఫకీర్‌బాషాను జగనన్న సురక్ష కార్యక్రమంలో వైసిపి నాయకులు, అధికారులు సన్మానించారు. కురబలకోట బస్టాండు నుంచి మూడువీధులకు చెందిన మురుగునీరు ప్రవహించేందుకు తగిన స్థలం లేనందున స్తానిక ప్రజలు అసౌకార్యానికి గురయ్యేవారు. జడ్పిటిసి బైసాని జ్యోతి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సుజాత మనోహర్‌లు, వైస్ సర్పంచ్ రజని రాజశేఖర్‌లు పకీర్‌బాషాను సంప్రదించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ శేషగిరి కుమార్ పాల్గొన్నారు.

## ఎస్‌బి టెట్ డిప్లమాలో జివిఐసి విద్యార్థుల ప్రతిభ

**కురబలకోట, జులై 6 ప్రభాతవార్త :**




ఎస్‌బి టెట్ నిర్వహించిన డిప్లమా మొదటిసంవత్సరం పరీక్షా ఫలితాల్లో గోల్డన్‌వ్యాలీ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారని కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రవీన్ తెలిపారు. ఈ ఏడాది మేలో నిర్వహించిన వార్షిక ఫరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. ఎలక్ట్రానిక్ విభాగంలో నవ్య 1000లకు 869మార్కులు సాధించి కాలేజ్ టాపర్‌గా నిలిచిందని కంప్యూటర్ విభాగంలో అక్షయ్ జేసికా 867, వినయ్‌కుమార్ 867 ఇద్దరూ కాలేజ్ రెండవ టాపర్‌గా నిలిచారన్నారు. కంప్యుటర్ విభాగంలో రెహమాన్, ఎలక్ట్రికల్ విభాగంలో, మెకానికల్ శ్యామ్‌కుమార్, సివిల్‌లో అలేఖ్యాలో ప్రతిభ కనపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారిని జివిఐసి ఛైర్మెన్ రమణారెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## న్యాయవాదుల చట్టాలను అమలు చేయాలి

### – అన్నమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్

**లక్కిరెడ్డిపల్లె, జులై 6, ప్రభాతవార్త:**



న్యాయవాదులపై జరుగుతున్న దాడు లను నియంత్రించేందుకు న్యాయవాదుల పరిరక్షణ చట్టాలను అమలు చేయాలని అన్నమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జీ కోర్టులో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసి డెంట్ టి.ఈశ్వర్ భారత న్యాయవాదుల సంఘం సీనియర్ న్యాయవాది చెన్నకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు జరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కక్షిదారుల పక్షాన పోరాటం చేసే న్యాయవాదుల కోసం అడ్వకేట్ ప్రొటక్షన్ యాక్ట్ (న్యాయవాదుల పరిరక్షణ చట్టం) ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె భారత న్యాయవాదుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక కన్వీనర్లుగా న్యాయవాదులు రాజ్ కుమార్, డీవీ రమణలను ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు కడప అన్నమయ్య జిల్లాల భారత న్యాయవాదుల సంఘం వర్కిం గ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ తెలిపారు. కార్య క్రమంలో న్యాయవాదులు రాజ్‌కుమార్, వీవీ రమణ, సిద్దయ్య పాల్గొన్నారు.

## ముగిసిన అంతర్జాల తెలుగు జాతీయ సదస్సు

**కమలాపురం, జులై 6, ప్రభాతవార్త:**

సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ పీజీ కళాశాల ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యం..ప్రక్రియ వైవిధ్యం అంతర్జాల జాతీయ సదస్సు 2 రోజుల పాటు దిగ్విజయంగా ముగిసింది. గురువారం సదస్సులో భాగంగా నాలుగు సమావేశాలు ఎనిర్వహించారు. ఈ నాలుగు సమావేశాల్లో యోవేవి ఆచార్యులు టి.రాం ప్రసాద్‌రెడ్డి, రమాదేవి, ప్రొద్దుటూరు ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు డా.కె. సుందరేశ్వర రావు పాల్గొని అధ్యక్షత వహించారు. వారి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60 మంది ఆచార్యులు, పరిశోధకులు పాల్గొని పత్ర సమర్పణ చేయేయడం జరిగింది. తెలుగు సాహిత్యం నాటి నుంచి నేటి వరకు పురుడు పోసుకున్న ఎన్నో రకాల ప్రక్రియల వైవిద్యం గురించి వక్తలు తమ ఉపన్యాసాలను అందించడం విశేషం. చివరగా జరిగిన సందేశంలో ఎస్వీ యూనివర్శిటీ ప్రాచ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆచార్య వీసీ వెంకటేశ్వర్లు పాల్గొని తెలుగు సాహిత్యం ఎంతో వైవిధ్య భరితమైనదని, మరే భాషలోనూ లేని ప్రక్రియలు తెలుగు భాషకు సొంతమని ఈ ప్రక్రియల ద్వారా అనేక రకాలైన బావజాలంతో వివిధ రకాల శైలి విన్యాసాలతో అద్భుతమైన నుడికారాలతో, జాతీయాలతో తెలుగు భాష,తెలుగు సాహిత్యం ప్రకాశిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులను, అధ్యాపకులను పరిశోధకులను కళాశాల ప్రిన్సిపల్ సీవీ రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో ఈ పత్రాలన్నిటినీ ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రచురించగలమని తెలిపారు. ఈ రెండు రోజుల కార్యక్రమాన్ని చాలా జాగ్రత్తగా బాధ్యతాయుతంగా నిర్వహించినందుకు వైస్ ప్రిన్సిపల్ డా.పల్లాకృష్ణను, తెలుగు శాఖ అధ్యక్షులు డా.ఎం.లక్ష్మయ్యను, సాంకేతిక సహకారం అందించిన డి.వినయ్‌కుమార్, పి.మహేష్‌రెడ్డి, కె.శ్రీనివాసులును ప్రశంసించారు.

## జగనన్న సురక్ష పథకం ఎంతో ఉపయోగం

### – నగర పంచాయతీ ఏవో రమాదేవి

**బి.కొత్తకోట, జులై 6, ప్రభాతవార్త:**



ప్రజల కష్ట నష్టాలను పాదయాత్రలో చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి సర్టిఫికెట్ల సమస్యలు పరిష్కారానికి జగనన్న సురక్ష పథకం ప్రారంభించి నట్లు బి.కొత్తకోట నగర పంచాయతీ మేనేజర్ ఏవో రమాదేవి పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ సచివాలయం లో జగనన్న సురక్ష కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగి అవస్థలు పడ్డారని నేడు ఆ సమస్య పరిష్కారానికి మీ ఇంటి వద్దకే క్షేత్రస్థాయిలో సర్టిఫికెట్లు మంజూరుకు జగనన్న సురక్ష పథకం అందుబాటులో ఉందన్నారు. సర్టిఫికెట్ల మంజూరుతో పాటు స్థానికంగా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కృషి చేస్తోందని హామీ ఇచ్చారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు గ్రామసభలో 11 రకాల సర్టిఫికెట్లను ప్రజా ప్రతినిదులు అందజేశారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష స్పెషలాఫీసర్ సతీష్‌కుమార్, ఎస్.ఎస్. ఫయాజ్, నక్కా సంతోష్; నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం జగన్ మానస పుత్రికే జగనన్న సురక్ష

### – జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప

**తంబళ్లపల్లె, జులై 6, ప్రభాతవార్త:**




రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నిరుపేద ప్రజలు సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ చూసి తన మానస పుత్రికగా జగనన్న సురక్ష ప్రవేశపెట్టి వారి బాధలు తీర్చారని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప పేర్కొన్నారు. గురువారం మండలంలోని రేణుమాకులపల్లెలో సర్పంచ్ అలీ అహ్మద్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి మాట్లాడుతూ నాడు ఎన్టీ రామారావు మండల వ్యవస్థ తీసుకు రాగా నేడు సీఎం జగన్ ప్రజల చెంతకే ప్రజా పాలన తీసుకొచ్చిన ఘనత దేశంలో ఏ ముఖ్యమంత్రికి లేదని ఒక్క మన సీఎంకే దక్కిందన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా సర్టిఫికెట్లతో పాటు స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షుడు రేవన చౌడేశ్వర, వాటర్ షెడ్ ఛైర్మన్ ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర పద్మశాలి సంఘ డైరెక్టర్ సురేంద్రనాథ్, ఎంపీడీవో సురేంద్రనాథ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏవో ఆనంద్‌కుమార్, డా.ఆశాలత, ఏపీఎం గంగాధర్, ఏపీఓ అంజనప్ప, సీసీ బద్రి, కార్యదర్శి శాకమ్మ, సంఘమిత్ర శివశంకర్‌రెడ్డి, నందా, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు, గృహ సారథులు, ప్రజలు పాల్గొన్నారు.

## యూఏఈ (దుబాయ్) వైకాపా కన్వీనర్‌గా సయ్యద్ అక్రం

**కడప కార్పోరేషన్, జులై 6, ప్రభాతవార్త:**



యూఏఈ (దుబాయి) వైకాపా కన్వీనర్‌గా సయ్యద్ అక్రమంను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, సీఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి నియమించారు. కడప నగరానికి చెందిన అక్రం 12 సంవత్సరాల నుంచి దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారని గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ పేర్కొన్నారు. అక్రం తండ్రి కూడా కువైట్‌లో పని చేస్తున్నారని తెలిపారు. వైకాపా యూఏఈ అడ్వైజరీ కమిటీ సభ్యులు సోమిరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి సయ్యద్ అక్రం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా అక్రం మాట్లాడుతూ నాపై నమ్మకంతో వైకాపా యూఏఈ కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు, సీఎం జగన్‌మో హన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.విజయ సాయిరెడ్డికి, ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ మేడపాటి వెంకట్, ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌బాబు, ఎంపీలు వైఎస్.అవినాష్‌రెడ్డి, పి.మిథున్‌రెడ్డి, శాసన సభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, యూఏఈ అడ్వైజరీ కమిటీ సభ్యులు సోమిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మండల విద్యాశాఖాధికారులకు సన్మానం

**ముద్దనూరు జూన్ 6, ప్రభాతవార్త**



ముద్దనూరు మండల విద్యాశాఖ అధికారులుగా, ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముద్దనూరు ఎంఈఓ 1 సుబ్బారావు, ముద్దనూరు ఎంఈఓ 2 నాగేశ్వర నాయక్‌ను ఘనంగా సన్మానించడం జరిగింది. గతంలో ముద్ద నూరు ఎంఈఓ గా బాధ్యతలు నిర్వహించిన విజయ భాస్కర్ రెడ్డికి వీడ్కోలు పలకడం జరిగింది. ముద్దనూరు మాజీ మండలాధ్యక్షుడు కేవీ మునిరాజారెడ్డి, ముద్దనూరు ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**మైదుకూరు జూన్ 6, ప్రభాతవార్త**



మైదుకూరు పట్టణంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెస్ట్ విద్యార్థులకు గురువారం మైదుకూరుకు చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు 15వ వార్డు ఇన్చార్జి కరిడి. శ్రీనివాసరావు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాలలో ఉన్న సుమారు 40 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ రామారెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజు, చెన్నమ్మ ఆరోగ్య మిత్ర సుభాషిని లక్ష్మి లహరి తదితరులు పాల్గొన్నారు

## 23న నూతన పార్టీ ఆవిర్భావం

### – రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్రయ్య యాదవ్

**కడప వైద్యవిభాగం, జులై 6, ప్రభాతవార్త:**



కడపలో రామచంద్రయ్య యాదవ్ ఆధ్వర్యంలో నూతన పార్టీ ఆవిర్భావ సన్నా హక సమావేశంలో రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా కడపకు విచ్చేసిన ఆయన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నేతలు పడుతున్న ఇబ్బందులను చూసి నూతనంగా పార్టీ ఆవిర్భావం చేస్తామని రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక మయూర గార్డెనియా ఫంక్షన్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్శిటీ వేదికగా ఈనెల 23వ తేదీన రాష్ట్రంలో నూతన పార్టీ ఆవిర్భావం జరుగుతుందన్నారు. సుధీర్ఘంగా పాలించిన పార్టీలు దోపిడీ చేశారన్నారు. రాషాభివృద్ధికి పాటుపడని పార్టీలు ఎన్ని ఉన్నా ఫలితం లేదన్నారు. పారిశ్రామికరంగంగా ఎంతో వెనకబాటు తనం ఉందని కుటుంబ పాలనకు చరమ గీతం పాడాలన్నారు. ఎన్ని పార్టీలు ఉన్నా ఎంత మంది సీఎంలు అయినా బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడాలంటే మార్పు అవసరమన్నారు. బడుగు, బలహీన వర్గాలు కోరుకుంటున్నారని దోపిడీ పార్టీల పతనానికి ఇదో మొదటి అడుగన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు శివ యాదవ్, బీసీ మహాసభ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, మానవ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు జేవీ రమణ, ముస్లిం మైనార్టీ జేఏసీ బాబు, రాయలసీమ యాదవ సంఘం అధ్యక్షులు నారాయణ, దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాలినీ, ఉమాదేవవి, దళిత అభివృద్ధి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రమణ పాల్గొన్నారు.

## మాపై దాడి చేసిన వారిని శిక్షించి న్యాయం చేయాలి

**కడప వైద్యవిభాగం, జులై 6, ప్రభాతవార్త:**



మాకు భూమి అమ్మి కొంత సొమ్ము తీసుకొని రిజిస్టర్ సమయంలో మేము భూమి అమ్మము అని వెనక్కి తిరిగిన దర్బార్ బాషా బంధువులు నా భార్యపై, నాకుమారులపై దాడి చేసి బలంగా గాయ పరిచిన వారిని కఠినంగా శిక్షించి మాకు న్యాయం చేయాలని రామాపురం మండలం ఉండుమువారిపల్లి సరస్వతి గ్రామా నికి చెందిన షేక్ అల్లా బకాష్ కోరారు. గురువారం రిమ్స్ ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థలం విషయంలో మాకు, దర్బార్ బాషాకు మనస్పర్ధలు ఉన్నాయన్నారు. మే నెల 24వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో నన్ను, నా భార్య షేక్ షకీలా బేగంపై ఇనుప రాడ్డుతో దాడి చేశా రన్నారు. రామాపురం పోలీసు వారు వారి మీద కేసులు నమోదు చేశా రన్నారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అప్పటి నుంచి పలు మార్లు స్పందనలో డీఎస్పీ, ఎస్పీలకు మాకు ప్రాణ హాని ఉందని అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. ఎలాంటి భద్రత లభించలేదన్నారు. జులై 4వ తేదీన రాయచోటి డీఎస్పీని కలవడం జరిగిందన్నారు. దీంతో వారు కోపోద్రిక్తులై 5వ తేదీ నాపై నా భార్య, బిడ్డలపై కత్తులు, కొడవళ్లతో, రాడ్లతో దాడి చేశారన్నారు. గాయ పడిన ముగ్గురు పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం రిమ్స్‌లో, కొందరు తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నామని మాపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని మాకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

## నీట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికైన గంగిరెడ్డి నరేంద్రకుమార్‌రెడ్డి

**ఖాజీపేట జులై 06, ప్రభాతవార్త**



ఖాజీపేట మండలం బి.తిప్పాయపల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి నరేంద్ర కుమార్ రెడ్డి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) కాలికట్ నందు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపిక అయ్యారు. ఇతని తల్లిదం డ్రులు గంగి రెడ్డి చెన్నారెడ్డి, నాగేశ్వరమ్మ. ప్రస్తుతం ఇతను ఐఐటీ కొట్టాయం నందు అసి స్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అత్యున్నత విద్యాసంస్థలో ఉద్యో గానికి ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## జగనన్న సురక్ష పేద ప్రజలకు వరం

### మార్కెట్ యార్డు ఛైర్మన్ విశ్వనాథరెడ్డి

**రామాపురం జులై 06, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేద బలహీన బడుగు వర్గాలకు ఒక వరం లాంటిదని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ యార్డ్ ఛైర్మన్ విశ్వనాథరెడ్డి, జడ్పిటిసి మాసన వెంకటరమణలు అన్నారు. మండలంలో గురువారం కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ సూర్యనారాయణపురం. బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డి గారి పల్లెలో గ్రామ సచివాలయాలలో గ్రామ సర్పంచులు ధనలక్ష్మి వెంకట రెడ్డి గారి పల్లెలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి సుస్మిత ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గ్రామాలలో వాలం టీర్ల గుర్తించి జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు అందడం అంటే ప్రజ ల వద్దకు పాలనను తలపిస్తుందని వారు అన్నారు. కసి రెడ్డి గారి పల్లెలో 280 బండపల్లిలో 194 మందికి ధ్రువీక రణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసిల్దార్ అరవింద్ కిషోర్ ఎంపీడీవో హైదర్ వల్లి మండల ఉపాధ్యక్షులు రవిశంకర్ రెడ్డి బాబు బండ పల్లి గ్రామం ఉపసర్పంచ్ రాజశేఖర్ రెడ్డి కసరెడ్డి గారి పల్లి ఉపసర్పంచ్ మామిళ్ళ శివయ్య పార్టీ నాయకులు రఘురామయ్య రేఖ నారాయణ బాబు. జనార్దన్ రెడ్డి శివయ్యా రవీంద్రనాథ్ రెడ్డి సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని అడిగితే తప్పుడు కేసులా?

**ఖాజీపేట జులై 06, ప్రభాతవార్త**



ఒకటో తేదీ బీరం శ్రీధర్ రెడ్డి స్కూల్లో విద్యార్థి మృతి పై అక్కడి కెళ్లిన విద్యార్థి సంఘాలు ప్రజాసంఘాల పై, విలేకరులపై యాజమాన్యం పెట్టిన కేసును వెంటనే తొలగించకుంటే రాబోయే రోజుల్లో పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని మాల మహానాడుతో పాటు విద్యార్థి సంఘాలు మీడియా సమావేశంలో తీవ్రంగా హెచ్చరించాయి. స్కూల్‌లోకి ఎవరు ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు కానీ స్కూల్ ఆవరణంలోకి పోకూడదని సీఐ చెప్పడం విడ్డూరంగా ఉందని గతంలో ఇన్ని కార్యక్రమాలు చేసినా ఎప్పుడు ఇలాంటి ప్రస్థవన రాలేదని పోలీసులు యాజమాన్యానికి కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. బీరం శ్రీధర్ రెడ్డి స్కూల్‌లో జరిగిన విద్యార్థి మృతి దగ్గరకు వెళ్లిన ప్రజాసంఘాలు విద్యార్థి సంఘాల పైన విద్యా సంస్థ అక్రమ కేసులు పెట్టడంపై ఖాజీపేటలో మీడియా సమావేశం నిర్వహించిన ప్రజా సంఘాలు యాజమాన్యంపై మేము కూడా కేసులు పెడతామని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట రమణ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పోలీసులు, అటు స్కూల్ యాజ మాన్యం తప్పుదోవ పట్టించి రాజ్యాంగానికి చదలు పట్టించే విధంగా తయారు చేశారని ఈ చర్యను వెంటనే విరమించుకోకపోతే స్కూలు యాజమాన్యంతో పాటు పోలీసుల మీద కూడా ఎస్టీ ఎస్సీ కేసులు పెట్టక తప్పదని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ హెచ్చరించారు.

## మొరుసుకాపు రెడ్ల కష్టాలను ఐకమత్యంతో ఎదుర్కొందాం

### – పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి

**తంబళ్లపల్లె, జులై 6, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఒక్కలి గర (మొరుపు కాపు రెడ్లు)లు తరతరాలుగా కష్టాల కొలిమిలో కొట్టుమిట్టాడుతున్నారని వారిని అన్ని విధాలా ఆదుకోవ డానికి ఐకమత్యంతో ముందుకు రావాలని ప్రముఖ పారిశ్రామికవేత్త కదిరినాధునికోట జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన తంబళ్ల పల్లె మండలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు కుటుంబాలకు మీకు నేనున్నానంటూ ఆర్థికంగా ఆదుకున్నారు. మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ ఎర్రివారిపల్లికి చెందిన ఎర్రంరెడ్డి ఈ మధ్య కాలంలో మృతి చెందాడు. ఆశ్రయం కోల్పోయిన ఆ కుటుంబంతో పాటు తంబళ్లపల్లెకు సమీపంలోని గోళ్లపల్లెవారి పల్లికి చెందిన రెడ్డప్పరెడ్డి కుమారుడు రెడ్డి మల్‌రెడ్డి అనారోగ్య కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి రూ.10వేలు చొప్పున జయచంద్రారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం గుండ్లపల్లి పంచాయతీ చెట్లవారి పల్లెలో గత కరోనాలో మృతి చెందిన ప్రదర్శన రెడ్డి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కలిగరలు నాటి నుంచి నేటి వరకు వ్యవసాయాన్ని నమ్ముకొని గిట్టుబాటు ధరలు లేక వలస కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట వేపూరి కోట ఆంజనేయరెడ్డి, మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, తరుగు శివారెడ్డి, నరసింహారెడ్డి, రాయలసీమ రమేష్‌రెడ్డి, బి.కొత్తకోట లోకనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గంగుల్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, టి.మల్‌రెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, జి.రెడ్డప్పరెడ్డి, సురేందర్‌రెడ్డి, సి. రెడ్డిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయులు బాబు జగ్జీవన్‌రామ్..

**కడప కార్పొరేషన్, జులై 6, ప్రభాతవార్త:**



కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా బాబు జగ్జీవన్ రామ్ దేశానికి సేవలు అందించారని 33వ డివిజన్ వైకాపా ఇన్‌ఛార్జి షేక్ గౌస్‌బాషా (చాక్లెట్), 34వ డివిజన్ వైసీపీ ఇన్‌ఛార్జి అలీ అక్బర్‌లు గుర్తు చేవారు. కడప నగర 33వ డివిజన్ బెల్లంమండిలోని నగరపాలక ఎంసీపీఎస్ ఉర్దూ పాఠశాలలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయులన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీం సేవా సమితి అధ్యక్షులు రాయల్ కరీముల్లా, ఉపాధ్యాయురాలు సయ్యద్ సోఫియా, విద్యా వాలంటీర్ జులేఖ, స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు ఆర్థిక సహాయం చేయాలి

### ఎ.పి. రైతు సంఘం డిమాండ్

**గాలివీడు, జులై 6 ప్రభాతవార్త :**



తెలంగాణ ప్రభుత్వ తరహాలో ప్రతీ రైతుకు ఎకరాకు రూ.10 వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గాలివీడులో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా మన రాష్ట్రంలో ప్రతి రైతు 2.45 లక్షల రూపాయల రుణ భా రంతో ఉన్నారన్నారు. దేశంలో ఆత్మహత్యలలో మన రాష్ట్రం 3వ స్థానంలో వుందన్నారు. వీరిలో అత్యధికులు పేద రైతులు, కౌలు రైతులే వుండటం శోచనీయమన్నారు. రైతులు, కౌలు రైతులందరిని ఆదుకొనేందుకు రాష్ట్రంలో ప్రతి రైతుకు ఎకరానికి రూ.10 వేల సాగు సాయం అందించాలని ఎ.పి. రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నామన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించడానికి 2 ఎకరాల వరకు సాగు చేస్తున్న ప్రతి రైతుకు రూ.20 వేల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలని, రెండు ఎకరాలకు పైబడిన వారందరికి ప్రతి ఎకరాకు రూ. 10 వేల చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు.

## సంక్షేమంలో రారాజు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

– అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లె, జులై 6, ప్రభాతవార్త:

సంక్షేమంలో రారాజు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, జడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డెయ్యలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దప్పేపల్లె, పందిళ్లపల్లె గ్రామాల్లోని సచివాలయం ఆవరణలో వాలంటీర్లు, గ్రామ ప్రజలు, మహిళలతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారని తెలిపారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వేరుశనగ విత్తన కాయలు అదనంగా తెప్పించి పంపిణీ చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. దప్పేపల్లె ప్రజలకు అవసరమైన 11 సర్వీసులకు 167 సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశామని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం కుల, ఆదాయ, పుట్టిన, కుటుంబ సర్టిఫికెట్లను వాలంటీర్లు ఉచితంగా అందిస్తున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వారు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్ రాజు, ఎంపీడీవో వెంకటరమణారెడ్డి, ఆర్ఐ సమ్మత్‌ఖాన్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్ సుబ్బమ్మ, మహేంద్రబాబు, వెంకట నారాయణరెడ్డి, జేసీఎస్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ నరేష్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి, ధర్మారెడ్డి, జయచంద్రారెడ్డి, మల్‌రెడ్డి, రంగారెడ్డి, జయచంద్రారెడ్డి, ఓబులేసు, ప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఢిల్లీ విశ్వనాథరెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ద్వారా 157 పత్రాలు పంపిణీ

దువ్వూరు, జులై 6, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ద్వారా గురువారం 157 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేసినట్లు మండల ప్రత్యేక అధికారి ఓ.ఎస్.నందన్ తెలిపారు. మండల పరిధిలోని అన్నపుసాత్రపు పల్లె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల ద్వారా ప్రజలకు అవసరమైన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం 11 రకాల సర్టిఫికెట్లను అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని అందులో భాగంగా 47 మందికి కుల, 56 మందికి ఆదాయ, 25 మందికి ఆధార్, ఫోన్ నెంబరు లింక్, 25 మంది రేషన్ కార్డులలో పేర్లు బదిలీ చేయడం వంటి సర్టిఫికెట్లు అందజేశా మన్నారు. వీటి ద్వారా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే 1వ తేదీ నుంచి అందుతాయని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధి కారి అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్ఐ జాన్సన్, బుక్కాయపల్లి సర్పంచ్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులు నివాస ధ్రువీకరణ ఆధారాలు సమర్పించాలి

కొండాపురం, జులై 6, ప్రభాతవార్త :

కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టు కింద మునకకు గురైన మొదటి విడత అనగా 14 గ్రామాల ప్రజలకు గౌరవ ముఖ్యమంత్రి ప్రకటించిన అదనపు ప్యాకేజీ పరిహారం రూ.3.25లక్షలు చెల్లించే విషయమై నివాస ధ్రువీకరణ ఆధారాలు సమర్పించాలని జమ్ములమడుగు ఆర్డీవో శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాసితులు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంటు పుస్తకం జిరాక్సు కాపీలతో పాటు 2004 నుండి 2007 మధ్య కాలం నాటి ఏదైనా నివాస ధ్రువీకరణ పత్రాలైన రేషన్‌కార్డు, ఓటరులిస్టు, ఓటరుకార్డు, అదే విధంగా మేజరైన కుమారుడు, కుమార్తెకు సంబంధించిన వయసు నిర్ధారణ పత్రాలైన పదో తరగతి మార్కుల జాబితా, బర్త్ సర్టిఫికెట్, మొదలగు ఆధారాలు తప్పనిసరిగా కొండాపురం తహసీల్దారు కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

## బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప పరిపాలనాదక్షుడు

వేంపల్లె, జులై 6, ప్రభాతవార్త :



భారత మాజీ ఉప ప్రధాని, కాంగ్రెస్ మాజీ జాతీయ అధ్యక్షుడు బాబూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ గాంధేయవాది, సమతావాది, గొప్ప పరిపాలనాదక్షుడని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతిని పురస్కరించుకుని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 40ఏళ్ల పాటు ఏకధాటిగా లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై ప్రపంచ రికార్డును, 30ఏళ్ల కేంద్రమంత్రిగా జాతీయ రికార్డును నెలకొల్పి ఓటమి ఎరుగని నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామక్రిష్ణ, చెన్నకేశవ, వేంపల్లె మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బద్రి, రాఘవయ్య, శివ, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, నామా వినయ్, కొమ్మద్ది శ్రీసాయి, తదితరులు పాల్గొన్నారు.

## దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త పడాలి

పులివెందుల, జూలై 6, ప్రభాతవార్త :



దోమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త పడాలని ఉపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు. తొండూరు మండలంలోని మల్లేల పాఠశాలలో గురువారం విద్యార్థులకు విషజ్వరాల పట్ల అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉన్న పాత్రలను తొలగించాలన్నారు. ఇంటిలో తరచూ వేపాకు పొగ వేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి సోమేశ్వరి, ఆరోగ్య కార్యకర్త వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు జ్యోతి, సరళ పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎండి రఫీ

రాయచోటి టౌన్, జులై 06ప్రభాతవార్త:



పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో గురువారం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎండి రఫీ ఆధ్వర్యంలో గురువారం వాహనాలు తనిఖీ చేశారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు వాహనం యొక్క సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండదాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వరాదని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఈ చలానాలను వెంటనే చెల్లించాలన్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అ ంతేకాకుండా రోడ్లపై వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి కేసు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని సిసి కెమెరాలు ద్వారా గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

– ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి, జులై 06ప్రభాతవార్త:



అఖిల భారత ఫారెస్ట్ సర్వీసు పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో 31వ రా ్యంకు, రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధిం చిన నారా భువనేశ ్వర్‌ను స్థాని క వైఎస్సార్‌సిపి కార్యాలయం లో గురువారం రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఘనంగా సన్మానించా రు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారిగా సేవలు అందించే అవకాశం రావడం అదృష్టంగా భావించాలన్నారు. పర్యావరణ చట్టాలను పటిష్టంగా అమలు చేసిన ప్పుడే సమాజానికి మంచి జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకొని సేవలందిం చాలని అభిలశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ ్స, రాష్ట్ర డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, నారా భువనేశ్వర్ దంపతులు, ప్రముఖ డాక్టర్ రేవూరి ధరణికుమార్ దంపతులు,

## ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించాలి

గాలివీడు, జులై 06ప్రభాతవార్త:



ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలని గాలివీడు మండలం-1, 2, నూతన విద్యాధికారులు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పరిషత్ హైస్కూల్‌లో పరిచయ వేదికలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి నైపుణ్యాలను మెరుగుపర్చుకొని నూతన పద్దతుల్లో ఉపకరణాలను రూపొందించి బోధించాలన్నారు. సమాజంలో అన్ని వృత్తుల వారిని తయారు చేసేది ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకునేలా ప్రేరణ కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి

పోరుమామిళ్ళ రూరల్, జులై 06ప్రభాతవార్త:



భారతీయ జనసంగ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జి జయంతి కార్యక్రమంను గురువారం పోరుమామిళ్ళలో బిజెపి బద్వేల్ ఇన్‌ఛార్జ్ ఉట్టి శ్రీనివాసులు, బిజెపి మండల అధ్యక్షుడు పల్లెంశెట్టి పండరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరంభారతదేశానికి ఒక రాజ్యాంగం కాశ్మీర్‌కు మరోక రాజ్యాంగం ఉండానికి వ్యతిరేకిస్తూ ఉద్యమం చేశారన్నారు. దేశం కోసం, ధర్మం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 1953 జూన్ 6వ తేదీన జైల్లోనే మరణించడం జరిగిందన్నారు. ఆయన స్థాపించినటువంటి భారతీయ జనసంగ్ రూపాంతరం చెందిన నేడు భారతీయ జనతా పార్టీగా అవతరించిందన్నారు. కార్యక్రమంలో రమణాచారి, పోరుమామిళ్ళ మండల ప్రధాన కార్యదర్శి వంగదారి జయరాం, మండల కార్యదర్శి డి. చెన్నకేశవులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పక్కాగా అందించాలి

ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మీ



రాజంపేట అర్బన్, జులై 6 ప్రభాతవార్త

ప్రభుత్వం గర్భవతులకు, పిల్లలకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని పక్కాగా అందజేయాలని ఐసిడిఎస్ జిల్లా ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మీ కోరారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కేంద్రాల పరిధిలో పనిచేసే అంగన్వాడి వర్కర్‌ల సమావేశంలో మాట్లాడుతూ పోషకాహారం గురించి తల్లులకు వివరించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల్లోనే తల్లులకు, పిల్లలకు పోషకాహారం సక్రమంగా ఇస్తున్నారా లేదా అని తెలుసుకుందామని గుర్తు చేశారు. ఇందులో తేడా వస్తే సహించనని స్పష్టం చేశారు. ఆధార్ సీడింగ్ తప్పక పూర్తి చేయాలని 6 ఏళ్లలోపు పిల్లలందరికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయాలని ఆదేశించారు. ఎస్‌డిజిలో భాగమైన అనిమిక్ గర్భవతులకు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరిగా అందించాలన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ట్రీ స్కూల్ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని టి.సరళాదేవి, సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద అంచుల్లో బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు

టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్

నందలూరు, జులై 6 ప్రభాతవార్త



విద్యుత్‌శాఖ నిర్లక్ష్య కారణంగా నందలూరు మండలంలోని బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రమాద అంచుల్లో ఉన్నారని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. గురువారం ఆయన పాఠశాల సందర్శన సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ 2 అడుగుల ఎత్తులో ఉండడం చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు. రెండు అడుగుల ఎత్తులో ఉండటం వల్ల విద్యార్థులు ప్రమాదానికి లోనయ్యే ఆస్కారం ఉందన్నారు. ఇంత నిర్లక్ష్యంగా విద్యుత్తుశాఖ ఉండటం దారుణం అన్నారు. విద్యార్థులకు జరగరానిది జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యుత్తుశాఖ అధికారులు వెంటనే బిసి గురుకుల పాఠశాలలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు 10 అడుగుల ఫినిషింగ్ వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్షంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

## నారా భువనేశ్వర్‌ను సన్మానించిన మానవత

రాయచోటి టౌన్, జులై 6 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం రెడ్డి వారి పల్లెకు చెందిన నారా భువనేశ్వర్ సివిల్స్ అఖిల భారత స్థాయిలో 31 వ ర్యాంకు ఏపి లో 2 వ ర్యాంకు సాదించినందుకు గాను రాయచోటి పట్టణం ప్రతిభా జూనియర్ కళాశాల నందు మానవత అధ్యక్షుడు వెంకట్రామి రెడ్డి అధ్వర్యంలో ఘనంగా సత్కరించి మానవత మేమొంటో ను అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక సాధారణ రైతుకుటుంబంలో జన్మించి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం తో డిల్లికి వెళ్లి సివిల్స్ లో శిక్షణ పొంది 31 వ ర్యాంకు తో ఐ ఎఫ్ ఎస్ ఎంపిక కావడం చాల అభినందనియమం అని అన్నారు. .భువనేశ్వర్ తిరువనంత పురంలో ఐ ఐ ఎస్ టి పూర్తీ చేశారు .విద్యార్థులు కూడా భవిష్యత్తులో నారా భువనేశ్వర్ ను స్ఫూర్తి గా తీసుకోని ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని ఈ సందత్బంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ మానవత సెక్రెటరి వెంకట రామానాయుడు ,కోశాధికారి రెడ్డప్ప రెడ్డి ,అరమాటి శివగంగి రెడ్డి ,గౌరవ సలహాదారుడు వెంకటరమణ, కేంద్ర కమిటి డైరెక్టర్ సహదేవ రెడ్డి ,జిల్లా డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి ,కో చైర్మన్ షకీల్ ,మాజీ అధ్యక్షులు కనపర్తి శివ శంకర్ రెడ్డి ,గుండ్లూరు వెంకటేష్ ,మానవత కార్యవర్గ సభ్యులు పీరయ్య ,డాక్టర్ ధరణి కుమార్ ,కుటుంబ సబ్యులు రామ్మోహన్ రెడ్డి ,గంగాధర్ నాయుడు ,మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

## 'జగనన్న సురక్ష'ను ఉద్యమంలా చేపట్టాలి

ప్రజా సమస్యల పరిష్కారానికై జగనన్న సురక్ష

– మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గోపాలస్వామి, కన్వీనర్ యద్దారెడ్డి



బద్వేలు అర్బన్, జూలై 06 ప్రభాతవార్త :

జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్యమంలా వార్డులలో నిర్వహించి 11 రకాల ధృవీకరణ పత్రాలను అప్పటికప్పుడే ప్రజలకు ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ వైస్ ఛైర్మెన్ యర్రగొల్ల గోపాలస్వామి, కన్వీనర్ ఈగ యద్దారెడ్డి, వార్డు 35వ వార్డు ఇన్‌ఛార్జ్ బిజ్జం రమణ అన్నారు. గురువారం 35వ వార్డు కౌన్సిలర్ బిజ్జం రాజేశ్వరి, వార్డు ఇన్‌ఛార్జ్ బిజ్జం రమణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వార్డు సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి, మున్సిపల్ కన్వీనర్ ఈగ యద్దారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గోపాలస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టారని, ఇప్పటికి మున్సిపాలిటీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని, వార్డులలో ప్రజలు దరఖాస్తు చేసుకున్న 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగానే ప్రజలకు అందజేయడం జరుగుతుందన్నారు. సురక్ష పథకం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలు మరింత చేరువవుతున్నాయన్నారు. అనంతరం వార్డు కౌన్సిలర్ బిజ్జం రాజేశ్వరి, వార్డు ఇన్‌ఛార్జ్ బిజ్జం రమణ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డులో ప్రజలు వివిధ రకాల ధృవీకరణ పత్రాలకు సచివాలయంలో అర్జీలు పెట్టుకున్న 360 మందికి ఒకేసారి వివిధ రకాల ధృవీకరణ పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా ప్రజలకు అవసరమైన వివిధ రకాల ధృవీకరణ పత్రాలను ఉచితంగా అప్పటికప్పుడే అందజేయడం ఎంతో సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, జె.చెన్నయ్య, పి.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసులు, ఆవుల చిన్ని, ఎ.వెంకట సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, బూత్ కన్వీనర్లుతో పాటు పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంతోనే రాష్ట్ర అభివృద్ధి

–మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి

చిన్నమండెం, జులై 06ప్రభాతవార్త:



జగన్ దిగిపోవాలి జనం బాగుండాలి అని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్,మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ని. పొలిమేరపల్లె పంచాయితీ లో బెస్తపల్లె,కాయలోల పల్లె, టిడిపి ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వైసీపి అరాచక పాలన గురించి,ఈ ప్రభుత్వం వల్ల ప్రజలకు కలుగుతున్న నష్టాలు గురించి ప్రజలకు వివరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ చెప్పిన మాటల మాయలో పడి మోస పోయామని ప్రజల వాపోతున్నారని ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా ఈ సైకోని తరిమికొడదాం అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్ కు చంద్రబాబు గ్యారంటీ ,మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాలలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్తున్నామని,ప్రజల నుండి లభిస్తున్న స్పందన చాలా సంతోషంగా ఉందని సైకో పాలనలో ఏ ఒక్కరు కూడా సంతోషంగా లేరన్నారు.ఒక్క ఛాన్స్ మాయలో పడి మోసపోయామని,నిరుద్యోగ యువత జాబ్స్ క్యాలెండర్ పేరుతో మోసపోయారన్నారు.ఉద్యోగులు తమ సమస్యలపై గవర్నర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేస్తే ఉద్యోగ సంఘాలకి ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం శోచనీయమన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా,వైసీపి పాల న తరిమి కొడదామని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.యువత భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం యువతే కీలకమని రమేష్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బెల్లం నర సింహ రెడ్డి ,యూనిట్ ఇంచార్జ్ లీజ్ చెన్నకృష్ణ రెడ్డి,హరి అమర్నాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి అల్లగాని రెడ్డెప్ప ,మాజీ ఎంపీపీ వెంకటాద్రి శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి ,నరసింహారెడ్డి,బోనమాల మాజీ సర్పంచ్ చెన్నకృష్ణ రెడ్డి,శివయ్య, నాగేంద్ర, శ్రీరాములు,గోపాల్,వెంకటాద్రి శివయ్య, ధర్మ, పాల్గొన్నారు.

## ఐటిడిపి కార్యకర్తల అక్రమ అరెస్టులు ఆపాలి

– ఎస్పీకి వినతిపత్రం అందజేసిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు

రాయచోటి, జులై 06ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లాలో ఐటిడిపి కార్యకర్తల అక్రమ అరెస్టు ఆపాలని తెలుగుదేశం పార్టీపొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి గురువారం అన్నమయ్య జిల్లా జిల్లా ఎస్పీ గంగాధర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ముఖ్యంగా ఐటిడిపి కార్యకర్తలను అక్రమ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ అన్నమయ్య జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు హైకోర్టు నిబంధనల మేరకు ఏ వ్యక్తి అయినా అరెస్ట్ చేసే ముందు 41ఏ నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేయవలసిందిగా జిల్లా ఎస్పీని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మండల రూరల్ అధ్యక్షుడు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ వాసు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జీవనోపాధి కోసం డ్రైవింగ్ శిక్షణ నేర్చుకోవాలి

వేంపల్లె, జూలై 6, ప్రభాతవార్త :



జీవనోపాధి కోసం డ్రైవింగ్ అనేది ఉపయోగపడుతుంది కాబట్టి ప్రతి నిరుద్యోగి డ్రైవింగ్ శిక్షణ తీసుకోవాలని వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వేంపల్లెలోని కాలేజిరోడ్డు దివ్యారామం ఆవరణలో బిఎస్ఆర్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత డ్రైవింగ్ శిక్షణను సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ నేర్చుకునే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు కూడా తెలుసుకోవాలన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ నరసింహులు మాట్లాడుతూ ఉచిత డ్రైవింగ్ శిక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిఎస్ఆర్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర మాట్లాడుతూ పేద యువకులకు డ్రైవింగ్ శిక్షణ ఎంతో అవసరం ఉంటుందని భావించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కవి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ కరస్పాండెంట్ వరప్రసాద్ సహకారంతో ఉచిత డ్రైవింగ్ నేర్చుకునే యువతకు టీ షర్టులను సీఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ రాము, వార్డెన్ మాణిక్యాలరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 13న ఈడిగపాలెంలో శ్రీ వినాయక సుబ్రమణ్యస్వామి కల్యాణం

రాజంపేట, జూలై 6 ప్రభాతవార్త



రాజంపేట పట్టణం ఈడిగపాలెంలో వెలిసిన శ్రీ వరసిద్ది వినాయక స్వామి, శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జూలై 13వ తేదీ గురువారం ఆడి కృతిక సందర్భంగా శ్రీ సిద్ది బుద్ది సమేత శ్రీ వరసిద్ది వినాయక స్వామి, శ్రీ వళ్ళి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం ఘనంగా జరగనుంది. కల్యాణోత్సవం లో పాల్గొన్న భక్తులకు శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వాముల డాలర్ తో పాటు పసుపు కుంకుమ, గాజులు, తాళిబొట్టు దారం, తీర్థ ప్రసాదములు అందజేయబడును. కల్యాణోత్సవంలో శ్రీ మహా గణపతి హెూమం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి హెూమం, శ్రీ మహాకాల సర్ప దోష నివారణ హెూమం జరుగును. కల్యాణోత్సవం తదుపరి అన్నదానం ఉంటుంది. కావున భక్తులు కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కాగలరు. వివరాలకు సెల్ నెంబర్ : 98485 33634 ను సంప్రదించగలరు.

## చదువుతోపాటు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

– జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం



రాయచోటి టౌన్, జులై 06ప్రభాతవార్త:

రాయచోటి డైట్ కేంద్రంలో ఏర్పాటుచేసిన శ్రీ వెంకటేశ్వర అకాడమిక్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ పురుషోత్తం గారు మాట్లాడుతూ సంస్థ అధినేత చెంచు వేణుగోపాల్ రెడ్డి గారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించి మండల స్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన విద్యార్థిని విద్యార్థులను అభినందించిరి విద్యార్థులు నాణ్యమైన విద్యతోపాటు సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు ఎంతోమంది పెద్దలు పేద కుటుంబాల నుంచి వచ్చి ఉన్నత స్థాయికి ఎదిగినటువంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని జీవితంలో తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు పిఆర్టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ రాయచోటి తాలూకాలోని ప్రతి మండ లం నుండి ప్రథమ స్థానంలో నిలిచిన వారికి 5116 రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి 4116 రూపాయలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి 3116 రూపాయలు చొప్పున ఆరు మండలాల నుంచి వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు దాదాపు 75 వేల రూపాయల నగదు బహుమతుల్ని విద్యార్థులకు అందజేయడమైనది ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఆర్య కుమార్ మాట్లాడుతూ మా సంస్థ ఆధ్వర్యంలో కరోనా సమయంలో కూడా దాదాపు రెండు సంవత్సరాల పాటు నిరంతరం పేద బడుగు బలహీన వర్గాల వారికి సేవలు అందించడం జరిగిందన్నారు తాలూకాలోని అన్ని మండలాల్లో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల పొందిన విద్యార్థిని విద్యార్థులకు ఇదే విధంగా 2019 వ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం బహుమతులు అందజేస్తున్నామన్నారు.

## సిహెచ్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు



చిట్వేలి, జులై 6 ప్రభాతవార్త

చిట్వేలి మండలంలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటి ఆధ్వర్యంలో గురువారం 41.08 రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతులను అందించారు. ఈ మేరకు స్థానిక జిల్లా పాఠశాల కస్తూర్బాగాంధి బాలికల పాఠశాలలోని విద్యార్థులకు అజ్ఞాత దాత తాతయ్య కీ.శే. శ్రీమాన్ చెట్లూరు రామాచార్యులు, కీ.శే. కృష్ణమ్మ జ్ఞాపకార్థం నగదు బహుమతిని సిహెచ్ఎస్ సంస్థ జ్ఞాపికను పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు అందజేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంఇఓ కోదండనాయుడు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు ప్రోత్సహించే విధంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం సిహెచ్ఎస్ సంస్థ వ్యవస్థాపకులు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి ఇంతియాజ్‌లు ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరాలని అన్నారు. దేశం గర్వించేలా ప్రతి విద్యార్థి కృషి చేయాలని, దేశం బాగుంటే మనందరం బాగున్నట్టే అని విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ప్రధానోపాధ్యాయులు ఎబిఎన్ ప్రకాష్, బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు, సిహెచ్ఎస్ సంస్థ సామాజిక కార్యకర్తలు శంకర, వరుణ్‌కుమార్‌రాజు, శివారెడ్డి, పులపత్తూరు సురేష్, సుబ్రమణ్యం, ఇలియాజ్, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 35 బస్తాలు రేషన్‌బియ్యం పట్టివేత

రాజుపాళెం,జూలై 6,ప్రభాతవార్త:

మండల పరిధిలోని తొండలదిన్నె గ్రామంలో గురువారం రెవిన్యూ అధికారులు, పోలీసులు 35 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసిన బోడెద్దుల ఓబులేసు సీజ్ చేశారు. ఈవిషయమై యస్ఐ రాజగోపాల్ అతని పైన కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




